గురువారం 13.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక


సంపుటి - 34 సంచిక - 113 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



డీఎస్సీపై అసత్య ఆరోపణలు చేయడం వైసీపీ మానుకోవాలి. డీఎస్సీపై అసెంబ్లీలో చర్చకు కూటమి ప్రభుత్వం సిద్ధం. ఈ నెల 17 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు జగన్ రావాలి. వైసీపీ ఆరోపణలకు ఆధారాలుంటే అసెంబ్లీలో బయటపెట్టాలి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**

# నేరాల రూపం మారింది..
# సాంకేతికతతో ఎదుర్కోవాలి



- క్రైమ్ దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం
- పోలీసులకు పూర్తి స్వేచ్ఛ.. గౌరవం
- రాజకీయ ముసుగులో నేరాలకు కఠినంగా వ్యవహరించాలి
- ఇకప్రతినెలా పోలీస్ పెర్ఫార్మెన్స్ రిపోర్టు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల రూపం కూడా మారిపోయిందని.. దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో తక్షణం ఆధారాలు కోల్పోకుండా చూడాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నేర నియంత్రణలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని ఆయన అన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి డీజీపీ నుంచి క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సీఎం సమావేశం నిర్వహించారు. డీజీపీ సహా రేంజ్ ఐజీలు, డీఐజీలు, డీఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. ఏపీ పోలీసుల కీర్తి దేశమంతా మార్మోగాలని దానికి అనుగుణంగా సిద్ధం కావాలని అన్నారు. నేరాల దర్యాప్తులో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెరగాలని సూచించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌ఓ వరకూ సమావేశం నిర్వహించటం ఇదే తొలిసారి. శాంతిభద్రతల విషయంలో లోటు పాట్లను సవరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఓ ప్రైడ్. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ విధానం అమలు చేయాలి. గడచిన రెండేళ్లుగా కాగ్నిజబుల్ క్రైమ్స్ 14 శాతం మేర తగ్గాయి. కాలానుగుణంగా నేరాలు కూడా మారుతున్నాయి. డిజిటల్ క్రైమ్, డిజిటల్ అరెస్టులు తదితర నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. దీనికి అనుగుణంగా సాంకేతికతను పోలీసులు అందిపుచ్చుకోవాలి.

**పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం:** 2019-24 మధ్య ఉన్న పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని ప్రధాన సమస్యగా తయారు చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. గౌరవం పెరిగేలా చర్యలు చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 14,770 సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న కెమెరాలను కలిపి 1 లక్ష కెమెరాలను అనుసంధానించాం. నేరాల దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డీఎన్ఏ డిటెక్షన్ లాంటి ఆధునిక విధానాలు పెరిగాయి. వేగంగా నేరాలను గుర్తించగలుగుతున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పోలీసు అధికారులు సమర్థంగా అమలు చేస్తే శాంతిభద్రతలు నియంత్రణలోకి వస్తాయి. రాజకీయ నేరాలు, డిజిటల్ నేరాలు, మిగతా 2లో...

## పరిశ్రమలతో స్వర్ణాంధ్రకు బాట



- 20 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు
- 10.86 లక్షల మందికి ఉద్యోగావకాశాలు
- ప్రాజెక్టుల వేగవంతమైన పూర్తికి సీఎం ఆదేశాలు

2లో

## ఏపీలో 'లిథియం' వేట



- వేంపల్లె-తుమ్మలపల్లె ప్రాంతాల్లో నిక్షేపాల అన్వేషణ
- రూ.140 కోట్ల అంచనా వ్యయంతో ప్రత్యేక ప్రాజెక్టు

2లో


## రయ్యిమంటూ రాజధానిలోకి!



- ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డును నేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- రూ.1,519 కోట్లతో 21.77 కి.మీ. ఆధునిక రహదారి

3లో

# డీఎస్సీపై చర్చకు
# జగన్ అసెంబ్లీకి రావాలి




ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**మంగళగిరి, ఆగస్టు 12(జర్నలిస్ట్ ఫైల్) :** డీఎస్సీ నియామకాలపై ఆరోపణలు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిజంగా ధైర్యం ఉంటే ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరై చర్చకు రావాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సవాల్ చేశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన జగన్ వైఖరిపై తీవ్ర విమర్శలు చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా ఏటా జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను అయోమయానికి గురిచేశారని ఆరోపించారు. పరిశ్రమలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టి యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీశారని విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారని, గత ప్రభుత్వం 6 వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇస్తే కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించి మాట నిలబెట్టుకుందని తెలిపారు. మిగతా 3లో...

- వైసీపీ ఆరోపణలకు ఆధారాలుంటే అసెంబ్లీలో బయటపెట్టాలి
- డీఎస్సీపై చర్చకు కూటమి ప్రభుత్వం సిద్ధం
- ఈ నెల 17 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు జగన్ రావాలి
- అర్హత సాధించిన అభ్యర్థులను అవమానించడం సరికాదు
- 16,347 మంది అభ్యర్థులకు జగన్ క్షమాపణ చెప్పాలి

## 'మన సభ-జన సభ'



- అసెంబ్లీలో ప్రజలతో స్వాతంత్ర్య సంబరాలు
- ఆగస్టు 14, 15 సాయంత్రాల్లో సామాన్యులు, విద్యార్థులకు సందర్శన
- విద్యుద్దీపాల వెలుగుల్లో అసెంబ్లీ.. పోలీస్ బ్యాండ్, సాంస్కృతిక కార్యక్రమాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర శాసన సభ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టానికి శ్రీకారం చుడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజా పండుగలా నిర్వహించేందుకు అమరావతి అసెంబ్లీ ప్రాంగణం సిద్ధమౌతోంది. కేవలం విద్యుత్ దీపాల అలంకరణలు, అధికారుల జెండా వందనానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజలను, విద్యార్థులను భాగస్వాములను చేయాలని శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. మిగతా 2లో...



## ఉప్పాడ తీరానికి రక్షణ కవచం

- రూ.323 కోట్లతో తీర రక్షణ గోడ నిర్మాణం
- ఐఐటీ-మద్రాస్‌తో ఎంవోయూ.. నవంబరు నుంచి పనులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బ తింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను ఐఐటీ - మద్రాస్‌కు అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్.డి.ఎమ్.ఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్.డి.ఎమ్.ఏ.) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది.

ఐఐటీ మద్రాస్ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు. మిగతా 2లో...

# గడువు తప్పితే చర్యలు

- పుష్కర పైప్‌లైన్ పనులకు వేగం పెంచండి
- అలసత్వం వహించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు
- అవసరమైతే క్రిమినల్ కేసులు.. జైలుకు పంపుతాం: మంత్రి




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనుల పురోగతిపై బుధవారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమీక్షలో పోలవరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఈఈలు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు వర్క్ షెడ్యూల్ అందజేశారని మంత్రి తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం పనులు జరుగుతున్నాయా లేదా అన్నదానిపై ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంత్రికి నివేదిక అందించారు. వర్క్ షెడ్యూల్ ఇచ్చి కూడా పనుల్లో వేగం పెంచకపోవడం ఏమిటని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలకు సంబంధించిన అత్యంత కీలకమైన పనుల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.

షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టు ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి మిగతా 2లో...

## ఖనిజ సంపదతో 'నేషన్ బిల్డింగ్'



- బీచ్‌శాండ్ మినరల్స్‌కు విలువ జోడించాలి
- రేర్‌ఎర్త్‌లో స్వయం సమృద్ధి సాధించాలి: చంద్రబాబు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా ఉన్న బీచ్‌శాండ్ మినరల్స్‌కు విలువ జోడించి, దేశ అవసరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి రాకుండా రాష్ట్రంలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సీఎం చంద్రబాబు చెప్పారు. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ కరణ్ అదానీ నేతృత్వంలోని బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో భేటీ అయింది. శ్రీకాకుళం జిల్లాలో రూ.16 వేల కోట్ల పెట్టుబడితో అదానీ గ్రూప్ ఏర్పాటు చేసే టైటానియం ప్లాంట్ ఏర్పాటు... బీచ్ శాండ్ మైనింగ్, ఏయే ఉత్పత్తులు వస్తాయి. మిగతా 2లో...

# పెట్టుబడుల వేటలో ఏపీ దూకుడు




- చెన్నై - కోయంబత్తూర్ సదస్సుల్లో పెట్టుబడుల వెల్లువ
- ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి
- సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్‌కు అంతా సానుకూలం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్ 2026'కి ముందుగా చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సీఐఐ) భాగస్వామ్యంతో.. ఏపీఈడీబీ సమన్వయంతో చెన్నై, కోయంబత్తూర్‌లో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షో విజయవంతమైనట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం తరపున మంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ వాణిజ్య సంస్థల ప్రతినిధులు పాల్గొనగా రాష్ట్రంలో విస్తృత పెట్టుబడి అవకాశాలను ప్రభుత్వ బృందం సవివరంగా ప్రదర్శించింది.

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ప్రగతిశీల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో సమృద్ధిగా ఉన్న సహజ వనరులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన మౌలిక వసతులు, వ్యూహాత్మక పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు మరియు పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించారు. అలాగే రాష్ట్రంలో సాగుతున్న సుపరిపాలన (గుడ్ గవర్నెన్స్), వేగవంతమైన వ్యాపార ప్రక్రియలు (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్), పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న మిగతా 2లో...

# నేరాల రూపం మారింది.. సాంకేతికతతో ఎదుర్కోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సోషల్ మీడియా అసభ్య పోస్టుల లాంటి నేరాలు పెరిగాయి. మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ అని పదేపదే చెబుతున్నాను. ఈ విషయంలో కఠినంగా ఉండాల్సిందే. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించటంలో విఫలం కాకూడదు. నేర నియంత్రణకు పోలీసులూ గోల్డెన్ అవర్ విధానాన్ని పాటించాలి. తప్పు చేస్తే నేరస్తులు తప్పించుకోలేరని తెలిసేలా చేయాలి. వివేకా హత్య కేసు ఘటనలో పూర్తి సమాచారం రాలేదు. పోలీసుల వైపు నుంచి జరిగిన కాస్ట్ లీ మిస్టేక్ అది. కొందరు కావాలనే తప్పు దోవ పట్టించారు. ఇల్లంతా రక్తం మరకలతో తడిస్తే ఆ ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇది పూర్తి నిర్లక్ష్యం. నేరస్తుల పట్ల ఉదాసీనంగా ఉండొద్దు. జీరో డ్రగ్స్, గంజాయి లేకుండా జాతీయ స్థాయిలో ఓ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నియంత్రణ కోసం డ్రగ్స్ వద్దు బ్రో అన్న ప్రచారాన్ని విస్తృతం చేయండి. రహదారి భద్రత కూడా కీలకమైన అంశం. రోడ్డు ప్రమాదాల అరికట్టేలా సైనేజీలు, రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌లను ఆడిట్ చేయాలి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించండి. అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ పార్టీలకు లేదు :** శాంతిభద్రతల విషయంలో విఫలమైతే తీవ్రమైన పరిణామాలు మనం అంతా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్క చిన్న నిర్లక్ష్యం మొత్తం పోలీసు వ్యవస్థపైనే మరక పడుతుంది. సింగయ్య వాహనం కింద పడిపోయి చనిపోతే కూడా ఎదురు ఆరోపణలు చేశారు. జగన్ కారు కింద పడిపోయినట్టుగా వీడియో వచ్చింది. కారు తొక్కేస్తే పొదల్లో పడేశారు. ప్రాణాలు కాపాడబోయిన పోలీసులపైనే నెపం పడింది. ఇబ్రహీంపట్నంలో రాజకీయ పార్టీ ర్యాలీలో రోడ్డుపై మోటారు సైకిల్ విన్యాసాలు ఏమిటి? పోలీసులపై కూడా దాడులు జరిగే పరిస్థితి ఉంది. ఏ పార్టీ అయినా రోడ్డుపై విన్యాసాలు చేసేందుకు అవకాశం లేదు. ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా వెళ్లటం అన్ని పార్టీల బాధ్యత. రాజకీయ పార్టీ నేతలు కాబట్టి ఫ్రీగా వదిలేస్తామంటే



శాంతిభద్రతల పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీలకు ఇష్టానుసారం వ్యవహరించే లైసెన్సు ఇవ్వలేదు. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒక పార్టీ నుంచే ఉంటున్నారు. పరామర్శలకు వెళ్లటం తప్పేం కాదు. రోడ్లపై చేసే ప్రదర్శనల వల్లే ప్రజలకు ఇబ్బందులు. విశాఖపట్నంలో 3 గంటల పాటు రోడ్లను బ్లాక్ చేశారు. అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లే వారు, ఆఫీసుకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే సీఎంగా నేను కూడా వాహన కాన్వాయ్ కుదించుకున్నాను. మానసిక పరిస్థితి సరిగాలేని కొందరు వ్యక్తులు చేసే నేరాలపై ప్రజల్లోనూ చర్చ జరగాలి. కొందరు రౌడీలే సామాజిక మాధ్యమాల్లో హీరోలుగా మారుతున్నారు.

**ఇక నెలవారీ పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్టు :** శాంతిభద్రతల విషయంలో ఏపీ అత్యుత్తమ రాష్ట్రంగా ఉండాలన్నదే లక్ష్యం. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్య ప్రచారం పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. నేర నిర్ధారణ రేటు పెరిగితే నేరాలు తగ్గుతాయి. పోలీసులు దర్యాప్తు చేసి విజయం సాధించిన కేసుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం పూర్తి స్థాయిలో అమలు కావాలి. రాజకీయ పార్టీల ముసుగులో కొందరు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నారు. గతంలో మద్యం తాగించేవారు, ఇప్పుడు గంజాయి మత్తులో వీరంగం చేస్తున్నారు. కొన్ని సామాజిక మాధ్యమాల సాయంతో నేరస్తులుగా మారుతున్నారు. టెక్నాలజీ నేరస్తులను పట్టిస్తోంది, అదే సమయంలో నేరాలు పెంచుతోంది. బ్యాలెన్సింగ్, ప్రాపర్ పోలిసింగ్ ఉండాలి. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం, సంఘ విద్రోహ శక్తులకు భయం కలగాలి. రాష్ట్ర అభివృద్ధితో పాటు శాంతిభద్రతలు కూడా కీలకం. అప్పుడే సుపరిపాలన సాధ్యం. డీజీ కార్యాలయం నుంచి పోలీసు స్టేషన్ వరకూ పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఇక నుంచి ప్రతీ నెలా పోలీసు పెర్ఫార్మెన్సు రిపోర్టును విడుదల చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్, సక్సెస్ స్టోరీస్ సహా వివిధ అంశాలను ప్రజలకు వివరిద్దాం. అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీసు స్టేషన్ల నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సహా శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగాలకు చెందిన 1650 మంది అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డీజీ ఎన్. మధుసూధన రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్హా, ఈగల్ టాస్క్ ఫోర్సు ఐజీ రవికృష్ణ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఉప్పాడ తీరానికి రక్షణ కవచం

(మొదటి పేజీ తరువాయి)

**నవంబర్ నుంచి పనులు ప్రారంభం :** ఐఐటీ మద్రాస్‌తో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్. ఎన్. హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ డా. ఎన్. వి. శివరామ ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్. ఎ. సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి. వి. రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# గడువు తప్పితే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడవద్దని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు.

పనుల్లో అలసత్వం వహించిన ఈఈకి మెమో జారీ చేయాలని ఈఎన్సీ నరసింహమూర్తిని మంత్రి ఆదేశించారు. ఇకపై పుష్కర లిఫ్ట్ స్కీం పైప్‌లైన్ పనులపై ప్రతిరోజూ వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్ అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు పుష్కర ఎత్తిపోతల పథకం పనులు కీలకమని పేర్కొన్నారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలు వెళ్లేలా నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీలను ఆదేశించారు.

# పెట్టుబడుల వేటలో ఏపీ దూకుడు




(మొదటి పేజీ తరువాయి)

సహాయ సహకారాలు వివరించారు.

ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్ప్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌తో తమకున్న సానుకూల అనుభవాలను పంచుకోవడం, రాష్ట్రంలో ఆకర్షణీయమైన పెట్టుబడి వాతావరణానికి నిదర్శనం అని మంత్రి తెలిపారు. మంగళవారం చెన్నైలో జరిగిన సదస్సులో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, ఇండో–జపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ఎస్. పద్మనాభన్, టీఈసీసీ చెన్నై డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ హ్యు, పోస్కో చెన్నై ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ మిస్టర్ జంగ్ ఊంగ్ కాంగ్‌తో చర్చలు జరపడంతో పాటు సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి మరియు ఎంఎస్ఎంఈ రంగాలలో ఉన్న అవకాశాలపై చర్చలు సాగినట్టు మంత్రి తెలిపారు.

బుధవారం కోయంబత్తూరులో జరిగిన సదస్సులో గోల్డ్ రిఫైనరీ, దీని ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి లభించే అవకాశాలపై ఎమరాల్డ్ జ్యువెలరీ మేనేజింగ్ డైరెక్టర్ కె. శ్రీనివాసన్‌తో చర్చించినట్టు మంత్రి తెలిపారు. అలాగే లీప్ గ్రీన్ సీఈఓ దేవానంద్‌తో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి, జియాన్ ఛార్జింగ్ సీఈఓ కార్తికేయన్ పళనిస్వామి, ఎల్. జీ. బాలకృష్ణన్ అండ్ బ్రదర్స్ డైరెక్టర్ మిస్టర్ రాజీవ్ పార్థసారథి, తిరుప్పూర్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్. తిరుక్కుమారన్, సీగర్ గ్రూప్ ఎండీ రాధాకృష్ణన్‌తో చర్చలు విజయవంతమైనట్టు మంత్రి తెలిపారు.

ఈ సదస్సుల్లో పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ ఇండస్ట్రీస్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, తయారీ రంగం, పారిశ్రామిక క్లస్టర్లు, పోర్టులు, లాజిస్టిక్స్ మరియు ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులలో ఉన్న విస్తృత అవకాశాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వివరించామని మంత్రి చెప్పారు. ఈ ఏడాది నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్ 2026కు ఈ చెన్నై–కోయంబత్తూర్ సదస్సుల్లో ఎంతో సానుకూల స్పందన లభించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

ఈ సదస్సుల్లో సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి. సాంబశివరావు, సీఐఐ చెన్నై ఛైర్మన్ ఆర్. వి. చారి, కోయంబత్తూర్ జోన్ సీఐఐ ఛైర్మన్ వి. నౌషాద్, వైస్ ఛైర్మన్ మహాలింగం రామస్వామి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో 'లిథియం' వేట



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో కీలక ఖనిజాల అన్వేషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కడప బేసిన్ పరిధిలోని వేంపల్లె పరిసరాల్లో లిథియం, గాలియం ఖనిజాల నిక్షేపాలపై విస్తృత స్థాయి అన్వేషణకు చర్యలు చేపడుతోంది. ఈ మేరకు సీఎస్ఐఆర్–నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), రాష్ట్ర గనులు–భూగర్భశాస్త్ర శాఖల మధ్య ఎంఓయూ కుదిరింది. బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌జీఆర్ఐ–రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. తుమ్మలపల్లె, పరిసర ప్రాంతాల్లో ఎన్‌జీఆర్ఐ నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో లిథియం, గాలియం ఖనిజాల ఆనవాళ్లు గుర్తించారు. లిథియం గరిష్ఠంగా 1,000 పీపీఎం, గాలియం 250 పీపీఎం వరకు ఉన్నట్లు అంచనా వేశారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నుంచి 100 శాతం నిధులతో... రూ. 140 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. మరోవైపు ఏపీలోని గనుల రంగంలో పరిశోధన, టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలకు సంబంధించి ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్––టెక్స్‌మిన్, గనుల శాఖ మధ్య సీఎం సమక్షంలో మరో ఎంఓయూ కుదిరింది. దీని ద్వారా రాష్ట్రంలో గనులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్ ఏర్పాటు చేయనుంది. ఈ ఎంఓయూ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

# పరిశ్రమలతో స్వర్ణాంధ్రకు బాట

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆగస్టు 12:ఈ ఏడాది డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సీఎం సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంత వరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయ్యింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదాన్ని తెలియచేసింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటి వరకూ జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ. 13.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం దక్కింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. కొందరు పనిగట్టుకుని కాలుష్యకారకాలంటూ దుష్ప్రచారం చేస్తున్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని అన్నారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నిటికీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని అన్నారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై విశాఖలోని పరిశ్రమలకు పుష్కలంగా నీటిని తీసుకెళ్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వస్తున్న పరిశ్రమల ద్వారా రాష్ట్రంలోని ఎకోసిస్టమ్‌కు ఎంత విలువ జోడిస్తున్నామన్న అంశాన్ని విశ్లేషించాలని సీఎం సూచించారు. ఏపీకి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఆతిథ్య రంగంలో వస్తున్న హోటల్ భవనాలు ప్రత్యేక నిర్మాణాలుగా ఉండేట్టు



చూడాలని అన్నారు.

**సెప్టెంబరు నాటికి అందుబాటులోకి 175 ఎంఎస్ఎంఈ పార్కులు :** రాష్ట్రంలో ఏర్పాటవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులన్నీ జాతికి గర్వకారణమేనని సీఎం స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్సు, హిందూపూర్ సమీపంలో ఏరో స్పేస్ ప్రాజెక్టులు రావాలని సీఎం నిర్దేశించారు. మూలపేట పోర్టు డిసెంబరులో ప్రారంభించేలా నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్, ఆధునిక వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ ప్రాజెక్టులను అనుసంధానించాలని అన్నారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు వెళ్లేలా రోడ్ రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండాలన్నారు. గత ఏడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపీబీలో అనుమతి పొందిన ప్రాజెక్టులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కులను కూడా పూర్తి చేసి 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు అందుబాటులోకి రావాలన్నారు. వన్ ఫ్యామిలీ–వన్ఎంట్రప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని సీఎం నిర్దేశించారు.

**20వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు :**

1. ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్ కర్నూలు జిల్లాలో రూ. 616 కోట్ల పెట్టుబడి, 130 మందికి ఉద్యోగాలు
2. జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ కర్నూలు జిల్లాలో రూ. 1533 కోట్ల పెట్టుబడి, 250 మందికి ఉద్యోగాలు
3. ఎఫ్ పీఈఎల్ రవ్వేద పవర్ , విజయనగరం జిల్లాలో రూ. 480 కోట్ల పెట్టుబడి, 275 మందికి ఉద్యోగాలు
4. వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్, కాకినాడ జిల్లాలో రూ. 15000 కోట్ల పెట్టుబడి, 1500 మందికి ఉద్యోగాలు
5. ఆరాధ్యా బయోగ్యాస్ , కర్నూలు జిల్లాలో రూ. 143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు
6. ఉషోదయా బయోగ్యాస్, నెల్లూరు జిల్లా, రూ. 143.47 కోట్ల పెట్టుబడి, 595 మందికి ఉద్యోగాలు
7. డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా, విశాఖపట్నం, రూ. 58,743 కోట్లు, 1250 మందికి ఉద్యోగాలు
8. మునోథ్ లీథియం బ్యాటరీ లిమిటెడ్, తిరుపతి జిల్లాలో రూ. 500 కోట్ల పెట్టుబడి, 240 మందికి ఉద్యోగాలు
9. ఏఐఎల్ డిక్సన్ ఇండియా లిమిటెడ్, కడప జిల్లా కొప్పర్తి క్లస్టర్ లో, రూ. 450 కోట్ల పెట్టుబడి, 7000 మందికి ఉద్యోగాలు
10. రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్, అనకాపల్లి జిల్లా, రూ. 85,200 కోట్ల పెట్టుబడి, 1880 మందికి ఉద్యోగాలు
11. ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్, విశాఖ జిల్లా, రూ. 31,387 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
12. సీఆర్ఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్ పీ, తిరుపతి జిల్లాలో రూ. 192.02 కోట్ల పెట్టుబడి, 200 మందికి ఉద్యోగాలు
13. ఆర్కే 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తిరుపతి జిల్లా లో రూ. 150 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు
14. సన్ రైజ్ హోటల్స్ ఇండియా లిమిటెడ్, కాకినాడ జిల్లాలో రూ. 54 కోట్ల పెట్టుబడి, 75 మందికి ఉద్యోగాలు
15. జెఎస్పీ హోటల్స్, రిసార్ట్స్ ఎల్ఎల్ పీ, కృష్ణా జిల్లాలో రూ. 63.79 కోట్ల పెట్టుబడి, 100 మందికి ఉద్యోగాలు
16. పావులూరి హోటల్స్, తిరుపతి జిల్లా, రూ. 58.74 కోట్ల పెట్టుబడి, 150 మందికి ఉద్యోగాలు
17. అగస్త్యా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ. 7799.96 కోట్ల పెట్టుబడి, 1000 మందికి ఉద్యోగాలు
18. అక్షత్ గ్రీన్ టెక్ లిమిటెడ్, విశాఖపట్నం జిల్లా రూ. 1600 కోట్ల పెట్టుబడి, 750 మందికి ఉద్యోగాలు
19. కోరమాండల్ ఇంటర్నేషనల్, శ్రీకాకుళం జిల్లా, మూలపేట, రూ. 2125 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగాలు
20. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్, చిత్తూరు జిల్లా కుప్పంలో రూ. 880 కోట్ల పెట్టుబడి, 447 మందికి ఉద్యోగాలు
21. ఎస్ట్రేలా లాజిస్టిక్స్ , విశాఖపట్నం జిల్లాలో రూ. 90 కోట్లు, 100 మందికి ఉద్యోగాలు
22. గణేష్ సాయి మౌనిష స్టీల్ వైర్స్, విజయనగరం జిల్లాలో రూ. 66 కోట్ల పెట్టుబడి, 120 మందికి ఉద్యోగాలు
23. వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ , నెల్లూరు జిల్లా, మనుబోలు, రూ. 500 కోట్ల పెట్టుబడి, 2000 మందికి ఉద్యోగాలు (ప్రైవేట్ పార్క్)
24. జయాదిత్యా ఆగ్రో లిమిటెడ్, కర్నూలు జిల్లాలో రూ. 300 కోట్లు పెట్టుబడి, 350 మందికి ఉద్యోగాలు
25. ప్రిసోల్ ఆగ్రో ఇండస్ట్రీస్, నెల్లూరు జిల్లాలో, రూ. 330.71 కోట్ల పెట్టుబడి, 1110 మందికి ఉద్యోగాలు

# ఖనిజ సంపదతో 'నేషన్ బిల్డింగ్'

(మొదటి పేజీ తరువాయి)

వాటిని ఏయే రంగాల్లో వినియోగిస్తారు... వాటికున్న డిమాండ్ వంటి అంశాలను అదానీ ప్రతినిధుల బృందం సీఎంకు వివరించింది. బీచ్ శాండ్లో లభ్యమయ్యే ఇల్మెనైట్ మినరల్ కు కు విలువ జోడించి.. టైటానియం స్లాగ్, ఁఋూ2, టైటానియం స్పాంజ్ వంటివి ఉత్పత్తి చేయవచ్చని అదానీ గ్రూప్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. పెయింట్స్, కోటింగ్స్, కాస్మెటిక్స్, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, యూవీ రక్షణ ఉత్పత్తులు వంటి వాటిల్లో ఁఋూ2ను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలోనే ఖనిజాల విలువను పెంచేలా వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. బీచ్‌శాండ్ మినరల్స్‌ను కేవలం ముడి ఖనిజంగా వెలికి తీయడమనే అంశంగానే కాకుండా... వాటి ద్వారా రాష్ట్రానికి, దేశానికి గరిష్ఠ ప్రయోజనం కలిగేలా మొత్తం విలువ ఆధారిత శ్రేణిని అభివృద్ధి చేయాలని సూచించారు. రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో దేశం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలని సీఎం చంద్రబాబు అన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్ అనేది నేషన్ బిల్డింగ్ కు ఉపకరించేలా ఉండాలని.. అలాగే రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేలా చూడాలని సూచించారు. రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో రాష్ట్రానికి అందుబాటులో ఉన్న వనరులు, అవసరమైన సాంకేతికత, సరైన టెక్నాలజీ భాగస్వాములను గుర్తించడంపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. ఈ మొత్తం ప్రక్రియ దేశానికి, రాష్ట్రానికి ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు. విశాఖలో తాము ఏర్పాటు చేయబోయే ఇందులో స్కిల్ డెవలప్‌మెంట్, అదానీ యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ స్కూల్, అదానీ ఆరోగ్య మందిర్ పేరుతో 1,000 పడకల ఆసుపత్రి, 150 సీట్ల మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అదానీ డేటా సెంటర్, ఐటీ పార్క్ నిర్మాణాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ వివరాలను అదానీ గ్రూప్ ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల వేతనాల చెల్లింపులో జాప్యం సరికాదు



**చల్లపల్లి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చే నామమాత్రపు గౌరవ వేతనాలలో కూడా విపరీతంగా జాప్యం జరగటం బాధాకరం అని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల నుండి వేతనాలు అందకపోవడంతో పలువురు కార్మికులు సురేష్ బాబు కలసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు లేక పారిశుద్ధ్య కార్మికులు తీవ్రఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజంతా పాఠశాలల్లో ఉండి కేవలం 6000 వేతనంతో పనిచేస్తూ మరుగుదొడ్లు,పాఠశాల ఆవరణ శుభ్రం చేస్తూ వేరే ఇతర ఉపాధి పనులకు కూడా వెళ్లడంలేదన్నారు.వారికి ఇవ్వాల్సిన వేతనాలు ఏప్రియల్ నుండి చెల్లించకపోవడం వల్ల కార్మికుల కుటుంబాలు దయనీయస్థితిలో జీవనం సాగిస్తున్నాయన్నారు. కార్మికుల సమస్యలను అసోసియేషన్ పక్షాన సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో వేతనాల చెల్లింపునకు చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీడి తెలిపారని సురేష్ బాబు చెప్పారు.

# 'మన సభ-జన సభ'

(మొదటి పేజీ తరువాయి)

గతంలో మాజీ సియం నందమూరి తారకరామారావు తరచూ చెప్పే"మన సభ–జన సభ" అనే స్ఫూర్తితో అసెంబ్లీ గేట్లను ప్రజల కోసం తెరవనున్నట్లు ఆయన ప్రకటించారు.ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలోని తన కార్యాయలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 14,15 తేదీలలో సాయంత్రం వేళల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు సకుటుంబంగా వచ్చి అసెంబ్లీ విద్యుత్ కాంతులను వీక్షించవచ్చని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సాయంత్రం వేళల్లో ప్రత్యేక పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు, స్వాతంత్ర్య పోరాట త్యాగాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.నేటి తరం పిల్లల తోపాటు భావితరాలకు దేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర,దేశ ఔన్నత్యం గురించి తెలియాలనే ఉద్దేశంతో విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని, వీలును బట్టి వారిని అసెంబ్లీ మెయిన్ హాల్ సందర్శనకు కూడా అనుమతిస్తామని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అసెంబ్లీ సందర్శనలో భాగంగా పరిమితంగా ఆన్ పేమెంట్ ప్రాతిపదికన ఫుడ్ కోర్టులు సైతం ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని తెలిపారు. అయితే ప్రాంగణంలో ఫోన్లతో రీల్స్ చేయడం వంటి వాటిపై భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని నిబంధనలు విధిస్తామన్నారు.

ఈనెల 17 నుండి మొదలయ్యే అసెంబ్లీ సమావేశాలను సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 14వతేది ఉదయం సిఎస్ సహా ఇతర కార్యదర్శులు,డిజిపి సహా పోలీసు ఉన్నాతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు మీడియాకు వివరించారు.

శాసనసభ సమావేశాలకు హాజరుకాని ప్రజా ప్రతినిధుల వైఖరిపై శాసన సభాపతి సిహెచ్.అయ్యన్నపాత్రుడు అసంతృప్తి వ్యక్తం చేశారు.సాధారణ ఉద్యోగి విధులకు వెళ్లకపోతే ఆసంస్థ లేదా కంపెనీ జీతం ఇవ్వదని, ప్రజల సమస్యలు చర్చించడమే ప్రాథమిక విధిగా ఉన్న ఎమ్మెల్యేలు సభకు రాకుండా వేతనాలు,భత్యాలు ఎలా డిమాండ్ చేస్తారని ప్రశ్నించారు. గతంలో సభకు రాకుండా నాలుగైదు రోజుల తర్వాత వచ్చి సంతకాలు చేసే దొంగ పద్ధతి ఉండేదని దానికి స్వస్తి పలుకుతూ తమ హయాంలో 'డిజిటల్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్' విధానం అమలులోకి తెస్తున్నామన్నారు.సభ్యులు కేటాయించిన సీట్లో కూర్చుంటేనే హాజరు పడుతుందన్నారు.సభకు హాజరుకాని ఎమ్మెల్యేల విషయమై తగు నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని వారి ఆదేశాల కోసం వేసి చూస్తున్నామని అన్నారు.కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని బార్బడోస్,గోవాలలో జరిగిన స్పీకర్ల వేదికలపై తాను ప్రతిపాదించినట్లు అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

ఇక వైసిపి అధినేత మాజీ సియం జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా అనే అంశంపై ఆయన స్పందిస్తూ నిబంధనల ప్రకారం సభలో అవసరమైనంత సంఖ్యా బలం లేనప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యపడదని తగిన సంఖ్యా బలం లేకుండా ఏ నిబంధనల ప్రకారం ప్రతిపక్ష హోదా ఇవ్వగలనని ప్రశ్నించారు.సీఎంతో సమానంగా ప్రతిపక్ష హోదా లేని నేతకు సమయం కేటాయించడం కుదరదని చట్ట సభలోని ప్రతి సభ్యుడికి మాట్లాడే అవకాశం సమానంగా లభిస్తుందని స్పీకర్ పేర్కొన్నారు.

ఈమీడియా సమావేశంలో అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి దేవాలయంగా పిలవడే రాష్ట్ర శాసన సభ మన సభ–జన సభ గా భావించి అందరూ సందర్శించేందుకు వీలుగా 80వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14,15 తేదీల్లో సా. 6గం.ల నుండి రాత్రి 9గం.ల వరకూ అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు.ముఖ్యంగా విద్యార్థులు,సామాన్య ప్రజలు ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.వచ్చే సందర్శకుల సంఖ్యను బట్టి అసెంబ్లీ సమావేశ హాల్లోకి మొబైల్ లేకుండా అనుమతించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు పేర్కొన్నారు.పరిసర ప్రాంతాల విద్యార్థులు ఆయా విద్యా సంస్థలకు చెందిన బస్సుల్లో వస్తారని మిగతా సందర్శకుల సౌకర్యార్థం కొన్ని ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాల్సిందిగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడం జరుగుతుందని సెక్రటరీ జనరల్ చెప్పారు.

## డీఎస్సీపై చర్చకు జగన్ అసెంబ్లీకి రావాలి



(మొదటి పేజీ తరువాయి)

డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రతిపక్షం 255 కేసులు వేసి నియామకాలను ఆలస్యం చేయాలని ప్రయత్నించిందని ఆలపాటి ఆరోపించారు. న్యాయపరమైన సమస్యలను అధిగమించి కంప్యూటర్ ఆధారిత పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి కేవలం 150 రోజుల్లో నియామకాలు పూర్తి చేయడం కూటమి ప్రభుత్వ ఘనత అన్నారు. అర్హత సాధించి తమ ప్రతిభతో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను వైసీపీ నాయకులు అవమానించడం సరికాదన్నారు. స్పోర్ట్స్ కోటాతో పాటు అన్ని రిజర్వేషన్ ప్రక్రియలను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించామని స్పష్టం చేశారు. డీఎస్సీపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్న వైసీపీ నేతలు ఒక్క అభ్యర్థి అయినా ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్సీ రెండుసార్లు దాఖలు చేసిన పిల్ విషయంలో కోర్టు ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయారని విమర్శించారు.

డీఎస్సీ నియామకాలపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని ఆలపాటి రాజేంద్రప్రసాద్ హితవు పలికారు. గతంలో తమ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రికార్డు స్థాయిలో 150 రోజుల్లో మెగా డీఎస్సీని పూర్తి చేసి యువతకు భరోసా కల్పించిందన్నారు. డీఎస్సీని రద్దు చేస్తామని చెప్పడం అర్హత సాధించిన అభ్యర్థుల జీవితాలతో ఆడుకోవడమేనన్నారు. జగన్‌కు నిజంగా చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి కూటమి ప్రభుత్వ పాలన, డీఎస్సీ నియామకాలపై చర్చించాలని సవాల్ చేశారు. సభకు రాకుండా బయట విమర్శలు చేయడం సరికాదని, 16,347 మంది ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువతను అవమానించినందుకు జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేని జగన్ ప్రెస్‌మీట్ల రాజకీయాన్ని ఆపాలి



**•మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ**

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** డీఎస్సీపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విమర్శించారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. 2019 ఎన్నికల్లో ఏటా మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి ఐదేళ్ల పాటు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందు కేవలం 6,100 పోస్టులతో అరకొర డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మభ్యపెట్టారని విమర్శించారు. కోవిడ్, జాతీయ విద్యా విధానం పేరుతో నియామకాలు ఆలస్యం చేశామని చెప్పడం సరికాదన్నారు. ప్రస్తుత డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా ద్వారా టెట్ రాయని వారికి ఉద్యోగాలు ఇచ్చారంటూ వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, అలా ఉద్యోగం పొందిన ఒక్క అభ్యర్థినైనా ఆధారాలతో చూపించాలని సవాల్ చేశారు. అబద్ధపు ప్రచారాలతో నిరుద్యోగ యువతను మళ్లీ మోసం చేయలేరని అన్నారు. డీఎస్సీపై అక్రమాలు జరిగాయని నిజంగా నమ్మితే ఆధారాలతో అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని డిమాండ్ చేశారు.

శాసనసభకు వచ్చే ధైర్యం లేక వైసీపీ అధినాయకత్వం ప్రెస్‌మీట్లకే పరిమితమై రాజకీయాలు చేస్తోందని ఏఎస్ రామకృష్ణ ధ్వజమెత్తారు. 2019--2024 మధ్య కేవలం 23 మంది ఎమ్మెల్యేలతోనే ప్రతిపక్షంగా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో ప్రజల తరపున పోరాడారని, ప్రస్తుతం 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న వైసీపీ సభకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. డీఎస్సీపై సీబీఐ విచారణ కోరుతున్న వైసీపీ నేతలు తమ పాలనలో జరిగిన ఆరోపణలు, కేసులపై కూడా అదే డిమాండ్ చేయాలని అన్నారు. మంత్రి నారా లోకేష్‌పై, డీఎస్సీపై సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు. 'జెన్-జెడ్ వార్' పేరుతో నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డీఎస్సీ నియామకాలు పారదర్శకంగా జరిగాయని, ఆధారాలు ఉంటే అసెంబ్లీలో నిరూపించాలని, లేకపోతే నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే దుష్ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని ఏఎస్ రామకృష్ణ డిమాండ్ చేశారు.

## ప్రజల ఏడుపే జగన్‌కు ఆనందం.. తీవ్రమైన అసూయతో రగిలిపోతున్నారు



**•ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్**

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, నిరుద్యోగులకు జరుగుతున్న మంచిని చూసి వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఓర్వలేక అసూయతో రగిలిపోతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారని తెలిపారు. వైసీపీ 335 కేసులు వేసి నియామకాలను అడ్డుకోవాలని ప్రయత్నించినప్పటికీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో 16,347 పోస్టుల భర్తీని అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని అన్నారు. విద్యాశాఖలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా ఈ ఏడాది 1.06 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని తెలిపారు. ఉపాధ్యాయ నియామకాలు పూర్తయి పాఠశాలల్లో చేరి ఏడాది కావస్తున్నా, మంచి ఫలితాలు వస్తుండటాన్ని చూసి జగన్ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడం విడ్డూరమని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ప్రతి నియోజకవర్గంలో లీప్ మోడల్ పాఠశాలలు, నో బ్యాగ్ డే, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు సింగపూర్‌లో శిక్షణ వంటి సంస్కరణలు చేపట్టినందుకు లోకేష్ రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. డీఎస్సీ-2025 ద్వారా కష్టపడి ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని శ్రీకాంత్ మండిపడ్డారు. వైసీపీ ఆరోపణలకు నిరసనగా కర్నూలులో 5 వేల మంది ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారని తెలిపారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినా జగన్‌కు బుద్ధి రాలేదని విమర్శించారు. 'జెన్ జీ'పై జగన్‌కు కనీస అవగాహన లేదని, వృద్ధులను కూర్చోబెట్టి 'జెన్ జీ వార్' పేరుతో నిరసనలు నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. 1997-2012 మధ్య జన్మించిన వారిని జెన్ జీగా పిలుస్తారని వివరించారు. ఈ నెల 17 నుంచి జరిగే అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలకు జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని సవాల్ చేశారు. చవకబారు ఆరోపణలు, ప్రేలాపనలు మానుకుని సభకు వచ్చి సద్విమర్శలు చేయాలని, ఏ అంశంపైనైనా సమాధానం చెప్పేందుకు కూటమి ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం, నిజాయితీ ఉన్నాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ అమరవీరులకు ఘన నివాళి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్) :** క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని బ్రిటిష్ పాలకుల తూటాలకు బలై వీరమరణం పొందిన తెనాలి ప్రాంతానికి చెందిన ఏడుగురు అమరవీరులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. రణరంగ్ చౌక్‌లోని ఏడు అమరవీరుల స్థూపాల వద్ద బుధవారం పూలమాలలు వేసి వారి త్యాగాలను స్మరించుకున్నారు. తెనాలి మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత కీలకమైన ఘట్టమని అన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలనే లక్ష్యంతో సాగిన ఉద్యమంలో తెనాలి ప్రాంతానికి చెందిన ఏడుగురు పాల్గొని బ్రిటిష్ వారి తూటాలకు బలై ప్రాణత్యాగం చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలని సూచించారు. ప్రతి సంవత్సరం రణరంగ్ చౌక్‌లోని అమరవీరుల స్థూపాల వద్ద నివాళులు అర్పిస్తూ వారి త్యాగాలను స్మరించుకోవడం జరుగుతుందని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం, త్యాగాల వల్లే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామని పేర్కొన్నారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుంచి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించాలనే లక్ష్యంతో మహాత్మాగాంధీ నాయకత్వంలో 1942లో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారని తెలిపారు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని వెంటనే విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తూ మహాత్మాగాంధీ 'చేయండి లేదా చావండి' అనే నినాదాన్ని ఇచ్చారని చెప్పారు.


1942 ఆగస్టు 9 నుంచి దేశవ్యాప్తంగా క్విట్ ఇండియా ఉద్యమం తీవ్రరూపం దాల్చిందని ఆలపాటి వివరించారు. మహాత్మాగాంధీతో పాటు పలువురు జాతీయ నాయకులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టు చేసినప్పటికీ ప్రజలు వెనుకడుగు వేయకుండా ఉద్యమాన్ని కొనసాగించారని తెలిపారు. విద్యార్థులు, కార్మికులు, రైతులు, మహిళలు సహా వివిధ వర్గాల ప్రజలు స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని క్విట్ ఇండియా ఉద్యమం మరింత బలపరిచిందన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమం అనంతరం స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటం మరింత ఉధృతమైందని, చివరకు 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభించడానికి దోహదపడిన ప్రధాన పరిణామాల్లో ఈ ఉద్యమం ఒకటిగా చరిత్రలో నిలిచిందని ఆలపాటి తెలిపారు. భారత ప్రజల ఐక్యత, ధైర్యం, స్వాతంత్ర్య కాంక్షకు క్విట్ ఇండియా ఉద్యమం ప్రతీకగా నిలిచిందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ద్వారా దేశభక్తి భావాలను మరింతగా పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అమరవీరుల కుటుంబ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తెనాలి ప్రాంతానికి చెందిన అమరవీరుల కుటుంబాల సేవలను గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురిని మంత్రి, ఎమ్మెల్సీ సత్కరించి అభినందించారు.

కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. రణరంగ్ చౌక్‌లోని అమరవీరుల స్థూపాల వద్ద నిర్వహించిన కార్యక్రమం దేశభక్తి నినాదాలు, అమరవీరుల స్మరణతో కొనసాగింది.

# రయ్యిమంటూ రాజధానిలోకి!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్, బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్నారు. దీంతో రాజధానిలోకి రాకపోకలు మరింత వేగవంతం, సులభతరం కానున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచస్థాయి ప్రమాణాలతో గ్రిడ్ తరహాలో అభివృద్ధి చేస్తున్న అమరావతి రాజధాని రహదారుల నిర్మాణానికి ఈ ప్రాజెక్టు కీలక ముందడుగుగా నిలవనుంది.

**34 రహదారులు... 350 కి.మీ :** అమరావతిలోని ఎన్-1 నుంచి ఎన్-17 వరకు ఉన్న అన్ని ఎన్-సిరీస్ రహదారులను ఇ-3 అనుసంధానించనుంది. ఉత్తరం నుంచి దక్షిణం, తూర్పు నుంచి పడమర దిశల్లో గ్రిడ్ తరహాలో రహదారులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. అనవసర మలుపులు లేకుండా రాజధాని ప్రాంతంలోకి నేరుగా చేరుకునేలా ఈ రహదారి వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇ, ఎన్ సిరీస్ రోడ్లలో కలిపి 34 ప్రధాన రహదారులు... మొత్తం 350 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్‌లో పెరగనున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని రాజధాని రవాణా వ్యవస్థకు పటిష్ఠమైన పునాది వేస్తున్నారు.

**రూ.1,519 కోట్లతో 21.77 కి.మీ :** దొండపాడు నుంచి ప్రారంభమయ్యే ఇ-3 రోడ్డు రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా మణిపాల్ హాస్పిటల్స్ వద్ద చీఎ-16ను కలుపుతుంది. 21.77 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.1,519 కోట్లు వెచ్చిస్తున్నారు. 60 మీటర్ల వెడల్పుతో మూడు దశల్లో నిర్మిస్తున్న ఈ కారిడార్‌లో 9 లేన్ల రహదారి, ప్రత్యేక బీఆర్టీఎస్ కారిడార్, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. డ్రైనేజీ, మంచినీటి సరఫరా, గ్యాస్, విద్యుత్ నెట్‌వర్క్‌లకు అవసరమైన మౌలిక వసతులను కూడా రహదారి నిర్మాణంతోపాటే కల్పిస్తున్నారు. సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు, గ్రీన్‌బెల్ట్‌లతో ఇ-3ను ఆధునిక నగర రహదారిగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది.

**బకింగ్ హామ్ కెనాల్‌పై ఉక్కు వంతెన :** ఇ-3 రోడ్డును విజయవాడ-మంగళగిరి హైవేతో అనుసంధానించేందుకు బకింగ్‌హామ్ కెనాల్‌పై రూ.82 కోట్లతో 478 మీటర్ల పొడవున నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జిని ప్రభుత్వం నిర్మించింది. దీనిని కూడా సీఎం చంద్రబాబు రేపు ప్రారంభించనున్నారు. వంతెన అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి రాకపోకలకు మెరుగైన మార్గం ఏర్పడుతుంది. కరకట్ట రోడ్డుపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తూ.. వాహనాలు సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా నేరుగా అమరావతికి చేరుకునే అవకాశం కలుగుతుంది. రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో రహదారుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోన్న ప్రభుత్వం.. మౌలిక వసతులను వేగంగా పూర్తి చేస్తోంది. రేపు సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఇ-3 రోడ్, స్టీల్ బ్రిడ్జి ప్రారంభం కావడం... అమరావతి పునర్నిర్మాణ వేగానికి మరో కీలక సంకేతంగా నిలవనుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు :** ఉదయం 10.20 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి వద్దకు చేరుకుంటారు. 10.35 గంటలకు శిలాఫలకం ఆవిష్కరిస్తారు. 10.45 గంటలకు ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు గుండా ప్రయాణించి రాయపూడికి చేరుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహ సముదాయాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 01.25 గంటలకు సచివాలయానికి చేరుకుంటారు. సాయంత్రం 06.30 గంటలకు నివాసానికి చేరుకుంటారు.

## ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కాలేజీలో ఘనంగా గ్రంథాలయ దినోత్సవం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కాలేజీలో గ్రంథాలయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం, జ్ఞాన సముపార్జనలో గ్రంథాలయాల ప్రాధాన్యతను వివరించడం లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్ మాట్లాడుతూ పుస్తక పఠనం విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఆలోచనా విధానం, సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతిరోజూ కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు.

వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీహరి మాట్లాడుతూ గ్రంథాలయం విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే ముఖ్యమైన వేదికగా పేర్కొన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు సాంకేతిక, సాహిత్య, విజ్ఞాన, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులు తమ జ్ఞాన పరిధిని విస్తరించుకోవచ్చన్నారు.

లైబ్రేరియన్ రసూల్ మాట్లాడుతూ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, జర్నల్స్, మ్యాగజైన్లు, ఇతర విద్యా వనరులను విద్యార్థులు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. పుస్తక పఠనాన్ని జీవితంలో మంచి అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకుని విద్యా, వ్యక్తిగత అభివృద్ధికి గ్రంథాలయాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## 'జూడా'ల సమ్మెకు ప్రభుత్వ వైద్యుల సంఘం సంపూర్ణ మద్దతు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** జూనియర్ డాక్టర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సమ్మె చేస్తున్న వైద్యులతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్ అసోసియేషన్ పిలుపు మేరకు ప్రారంభమైన సమ్మెపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు.

జూనియర్ డాక్టర్లకు ఎన్నో సంవత్సరాలుగా అమలు చేస్తున్న 15 శాతం పెంపును కొనసాగిస్తూ, 2026 జనవరి 1 నుంచి తదుపరి పెంపు కోసం వారు ఎదురుచూస్తున్నారని డాక్టర్ జయధీర్ పేర్కొన్నారు. అయితే కేవలం మూడు శాతం మాత్రమే పెంపు చేస్తామని ప్రభుత్వం పేర్కొనడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం జూనియర్ డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను కూడా సానుకూలంగా పరిగణించాలని కోరారు.

# వెల్లటూరు అభివృద్ధికి రూ.5.71 కోట్ల పనులు

**• సంక్షేమ పథకాలతో రూ.12.07 కోట్ల లబ్ధి: ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు**



**భట్టిప్రోలు(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో వెల్లటూరు గ్రామానికి రూ.12.07 కోట్ల విలువైన సంక్షేమ ప్రయోజనాలు అందించిందని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళా శక్తి, దీపం-2, ఎన్టీఆర్ భరోసా తదితర పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. 32 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.20.11 లక్షల వైద్య సాయం అందించినట్లు తెలిపారు.

గ్రామంలో రూ.5.71 కోట్ల విలువైన అభివృద్ధి పనులు, అనుమతులు, ప్రతిపాదనలు ఉన్నాయని ఎమ్మెల్యే చెప్పారు. సీసీ రోడ్లకు రూ.50 లక్షలు, ఎలిమెంటరీ పాఠశాల ప్రహరీ గోడకు రూ.7 లక్షలు, పౌల్ట్రీ అభివృద్ధికి రూ.70 లక్షలు, కస్టమ్ హైరింగ్ సెంటర్‌కు రూ.15 లక్షలు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4 కోట్ల అనుమతి లభించిందన్నారు. గౌడపాలెం రింగ్‌రోడ్డుకు రూ.20 లక్షల ప్రతిపాదనలు, ఎన్ఆర్‌జీఎస్ కింద డొంకల అభివృద్ధి ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. గౌడపాలెంలో రూ.9 లక్షలతో నిర్మించిన అశ్వద్ నారాయణ-మహాలక్ష్మి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు.

ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నక్కా ఆనంద్‌బాబు అన్నారు. 'స్వర్ణాంధ్ర--విజన్ 2047'తో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పన, సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి అభివృద్ధి, రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు, ప్రతి గ్రామానికి అభివృద్ధి అందేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అవయవదానంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు

**• అవయవదానంతో మరొకరికి పునర్జన్మ ప్రసాదించడం మహోన్నత సేవ: మంత్రి సత్యకుమార్ యాదవ్**




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** అవయవదానం ద్వారా మరొకరికి పునర్జన్మను ప్రసాదించడం మహోన్నతమైన సేవా కార్యక్రమమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ అవయవ దాతల దినోత్సవం సందర్భంగా బుధవారం భారతీయ విద్యా భవన్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. తాను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించే సమయానికి రాష్ట్రంలో 41 మంది బ్రెయిన్‌డెడ్ కాగా, వారి కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించడంతో 166 మందికి అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు.

2025లో 93 మంది అవయవదానం చేయగా, వారి ద్వారా 363 మందికి పునర్జన్మ ప్రసాదించగలిగామని మంత్రి వివరించారు. బ్రెయిన్‌డెడ్ అయిన అనంతరం అవయవదానం చేసిన వారి అంత్యక్రియలకు రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారులు హాజరై నివాళులర్పిస్తున్నారని చెప్పారు. దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన సైనికులు ఎంత గొప్పవారో, అవయవదానం చేసి ఇతరుల ప్రాణాలను కాపాడిన వారు కూడా అంతే గొప్పవారని సత్యకుమార్ యాదవ్ అన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. రక్తదాన శిబిరాలతో పాటు అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం, నేత్రదానం, అవయవదానంపై ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అవయవ మార్పిడి కోసం సుమారు 51 వేల మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని మంత్రి తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బ్రెయిన్‌డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి అవయవదానానికి అంగీకరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు మాట్లాడుతూ మారుతున్న జీవనశైలి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది కిడ్నీ, లివర్, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. అవయవ మార్పిడి కోసం జీవన్‌దాన్ యాప్‌లో వేలాది మంది నమోదు చేసుకున్నప్పటికీ ఇంకా అనేకమంది మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు.

అవయవదానంపై ప్రజల్లో అవగాహన పెంచి, దాతలుగా ముందుకు వచ్చేలా ప్రోత్సహించేందుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామని రామారావు తెలిపారు. సమాజహిత కార్యక్రమాలకు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి రెడ్‌క్రాస్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌తో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రెడ్‌క్రాస్ కార్నియా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం సంతోషకరమన్నారు.

కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి డాక్టర్ సునీత చౌరాసియా, రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ కోశాధికారి డాక్టర్ శ్రీహరిరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**-వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటిస్తూ విధులకు సకాలంలో హాజరు కావాలి**

**– ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి.. డెంటల్ విభాగంలో నూతన విధానాలను ప్రారంభించాలి.**

**పెద్దపల్లి, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

సుల్తానాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్వహణ, వైద్య సేవలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ వైద్యులు, ఇతర సిబ్బంది సమయపాలనపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రతి వైద్యుడు, సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరై, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.డెంటల్ విభాగంలో



అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, నూతన విధానాలను ప్రారంభించి, ప్రజలకు మెరుగైన దంత వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రి భవనం, వైద్య విభాగాలు, పరిసర ప్రాంతాలను నిరంతరం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులు, వారి సహాయకులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందేలా ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆసుపత్రి షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణపై కూడా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల అద్దెను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ఇందుకు సంబంధించిన నోటీసులను వారం రోజుల్లోగా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పెంచిన అద్దె మొత్తాన్ని వ్యాపారులు చెల్లించని పక్షంలో నిబంధనల ప్రకారం టర్మినేషన్ నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన సౌకర్యాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి,వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మసీదుబండలో తొలగిన రహదారి చిక్కులు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న మసీదుబండ రహదారి విస్తరణ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. శేరిలింగంపల్లి పరిధిలోని ఈ ప్రాంతంలో 100 అడుగుల రహదారి విస్తరణకు స్థానికులు స్వచ్ఛందంగా అంగీకరించడంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం పీఏసీ ఛైర్మన్ అరెకపూడి గాంధీ, చీఫ్ సిటీ ప్లానర్ వెంకన్న, నాయకుడు మారబోయిన రాజు యాదవ్‌లు బాధితులకు అంగీకార పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం 120 అడుగులు ఉన్న రహదారిని స్థానికులకు ఇబ్బంది కలగకుండా 100 అడుగులకు కుదించి ఒప్పించినట్లు చెప్పారు. ఆస్తులు కోల్పోతున్న వారికి సముచిత న్యాయం చేస్తూ వేగవంతంగా టీడీఆర్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. లింకు రోడ్ల అభివృద్ధి, రహదారుల విస్తరణతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సిగ్నల్ ఫ్రీ ప్రయాణంతో పాటు ట్రాఫిక్ కష్టాలు తీరుతాయన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీలు శైలజ, అక్బర్, స్థానికులు పాల్గొన్నారు.



# గ్రీన్ సిటీ కాలనీలో మహిళ అదృశ్యం



**హయత్‌నగర్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

హయత్‌నగర్ గ్రీన్ సిటీ కాలనీలో 38 ఏళ్ల మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. బొంగ్రాత్ సాయిబాబాకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన పెద్ద కుమార్తె లక్ష్మి (38)కి బాలకృష్ణతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. 2014లో బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో లక్ష్మి తన ఇద్దరు కుమారులతో కలిసి అప్పటి నుంచి తండ్రి ఇంట్లోనే నివసిస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 9న మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో లక్ష్మి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలోనూ గాలించినప్పటికీ లక్ష్మి ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి సాయిబాబా పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి అదృశ్యమైన మహిళ కోసం గాలింపు చేపట్టారు. లక్ష్మి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు

# ఘనంగా శోభ యాత్ర లో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్ణ రావు






శోభాయాత్ర పట్టణ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపింది.

**మార్కాపురం, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతతో పాటు ప్రతి పౌరుడిలో దేశభక్తి, జాతీయ భావం పెంపొందించే లక్ష్యంతో ఈ నెల 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై, ప్రతి వ్యాపార సంస్థపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని, జాతీయ జెండాలతో ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.ఈ కార్యక్రమంలో భాగంగా మార్కాపురం పట్టణంలోని ప్రధాన వీధులలో ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. త్రివర్ణ పతాకాలు చేతబట్టి దేశభక్తి నినాదాలతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పీవీ కృష్ణారావు ఆదేశాల మేరకు మార్కాపురం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి భారతీయుడు జాతీయ జెండాకు గౌరవం ఇవ్వాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతకు త్రివర్ణ పతాకం ప్రతీక అని పేర్కొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఎదుగుదల

## :రామాజీపేట్ లో అన్నప్రాసన కార్యక్రమం

**రాయికల్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం టేక్ హోమ్ రేషన్ పంపిణీతో పాటు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడంలో భాగంగా పంపిణీ చేశారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని, బాల్యంలోనే సమతుల్య ఆహారపు అలవాట్లను పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. తల్లులు పిల్లలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం చిన్నారులకు సంప్రదాయబద్ధంగా అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.చిన్నారులకు తొలిసారిగా అన్నం తినిపించే ఈ కార్యక్రమాన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమం



తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సూచనలు పాటించాలని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ బెజ్జంకి మోహన్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు, తల్లులు, చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వివిధ రకాల పంటలసాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన. శాస్త్రవేత్త డా.విజయ్ భాస్కర్

**పెగడపల్లి, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

వివిధ పంటలలో తీసుకోవలసిన "సస్యరక్షణ చర్యలు"పెగడపల్లి మండలంలోని ఆరవల్లి, పెగడపల్లి, బతికపల్లి గ్రామలలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్ర, కోఆర్డినేటర్, జగిత్యాల జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డా. ఎ. విజయ్ భాస్కర్ , వాతావరణంలో వస్తున్న మార్పుల వలన వరి ,ప్రత్తి ,పసుపు,కంది మరియు మొక్కజొన్న విత్తిన పొలాలలో క్షేత్ర సందర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయా పంటలలో అనుసరించాల్సిన సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించబడింది.వరి నాట్లు వేసేటప్పుడు కాలిబాటలు నిర్వహణతో పాటు, ముదిరిన మొక్కల పై భాగాన్ని కత్తిరించడం ద్వారా మంచి పెరుగుదల మరియు చీడపీడల నియంత్రణ సాధ్యమవుతుందని వివరించబడింది.పత్తి పంటలో



రసం పీల్చే పురుగుల ఉధృతి గమనించగా, వాటి నివారణకు ఏసిఫేట్ 1.5 గా/క్లోరోపైరిఫాస్ 2.0 మీ. లీ .మందులను వేపనూనె 5 మి.లీ.తో 1లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి లేదా "కాండపూ బొట్టు పెట్టే పద్ధతి "ద్వారా 1:4 ( మోనోక్రోటోపాస్: నీటిని) లేదా 1:20 (ఇమిడాక్లోప్రిడ్:నీటిని) నిష్పత్తి లో కలిపి 45 మరియు 60 రోజుల వ్యవధిలో వాడటం ద్వారా రసము పీల్చే పురుగుల ను తగ్గించవచ్చునును.మొక్కజొన్న పంట లో కత్తెర పురుగునివారణ కు క్లోరాంత్రినిప్రోలుపి 0.4 మిల్లీ లీటరల మందును 1లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి మరియు లింగాకర్షక బుట్టల ను 10 ఒక ఎకరా కు పెట్టాలని రైతులకు చెప్పారు.వర్షాలు పడుతున్నాయి కావున ఆరుతడి,చిరుధాన్యాలు , ఆయిల్ పామ్ మరియు కూరగాయ పంటలు కూడా విత్తహాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అదికారి శ్రీకాంత్, విస్తరణ అధికారినీ అశ్విని , సరోజినీ, రైతులు పాల్గొన్నారు.

# బంగారు పతకం సాధించిన

## శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎన్ 3బ్రాంచ్ విద్యార్థి షారూన్

**నంద్యాల, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**




నంద్యాల జిల్లా తైక్వాండో క్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అనుబంధముతో ఈ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలు 2026 ఆగస్టు 9న నంద్యాల పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ లో ఉన్న శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ బృందావనం ఆడిటోరియం లో జరిగాయి. ఈ పోటీలలో ఎన్జీవోస్ కాలనీ లో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ ఎన్3 బ్రాంచ్ విద్యార్థిని షారూన్ అండర్ 59 కిలోల బరువు కేటగిరిలో పాల్గొని అద్భుతమైన ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారు.ఈ విజయం సాధించిన విద్యార్థినినీ పాఠశాల ప్రిన్సిపల్ సయ్యద్ మౌలాబీ విద్యార్థిని అభినందించి ఈ విజయం సాధించినందుకు నాకు ఎంతో గర్వకారణంగా ఉందని, భవిష్యత్తు పోటీలలో మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ల ఏజీఎం సురేష్ మరియు ఆర్ఐ చౌదరి ,డీన్ రహమతుల్లా వైస్ ప్రిన్సిపల్ ,ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ లు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**– గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి**

**– దేశ ఎన్నికల వ్యవస్థపై గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం**



**నంద్యాల, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

:నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ నందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఎన్నికల ప్రక్రియనుచేపట్టారు. విద్యార్థిని ,విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కలిగిస్తూ వారిలో చైతన్యాన్ని నింపేలా ఓటింగ్ ను నిర్వహించారు. ఇందులో హెడ్ గర్ల్ హెడ్ బాయ్ ఎన్నికల పోటీల్లో నిలిచి ప్రచారం చేస్తూ, ఓటింగ్ లో పాల్గొనాలని విద్యార్థులను కోరారు. విద్యార్థులు ఎన్నికల పోటీలో నిలువగా హెడ్ గర్ల్ గా పి.సరయు రెడ్డి, హెడ్ బాయ్ గా ఎస్.శు భకరన్ విజేతలుగా నిలిచారు.ఈ సందర్భంగా గురునాథ ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతి అంశంపై అవగాహన ఉండేలా తమ పాఠశాలలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. దేశ ప్రగతిని మార్పును సూచించేది ఎన్నికలు.అందువల్ల ఎన్నికల వ్యవస్థపై ఎన్నికల అధికారుల నిర్వహణపై విద్యార్థులకు తెలియజేసేందుకు కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఇందులో పాల్గొన్న గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులను, విజేతలుగా నిలిచిన హెడ్ గర్ల్ ను, హెడ్ బాయ్ కి అభినందనలు తెలిపారు.

## మాజీ ముఖ్యమంత్రి వాల్మీకుల ఎస్టి పునరుద్ధరనపై వారి పార్టీ స్టాండ్ ఏమిటో 13న కర్నూల్ లో ప్రకటించాలి

**MVRPS**



**నంద్యాల, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి 2023లో వారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపి వారు చెయ్యిదులుపుకున్నారని, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో ఏనాడూ కూడా వాల్మీకుల ఎస్టి పునరుద్దరనపై ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని, శాసనమండలిలో కానీ పార్లమెంట్ లో కానీ వారి పార్టీ సభ్యులు ఎవరు ఇంతవరకు వాల్మీకుల అంశం పై మాట్లాడలేదని కేవలం వాల్మీకి కులానికి చెందిన మా ఎమ్మెల్యే వీరుపాక్షిగారు ఒక్కరే మాట్లాడా రని,ఎందుకు ప్రతిపక్ష హోదాలో మాట్లాడటం లేదో దీనివెనుక ఎవరి ప్రోద్బలం ఉందో, ఏవర్గాలు మీ పార్టీలో మా వాల్మీకుల అంశంపై మాట్లాడకుండా అడ్డుకుంటున్నారో రేపు కర్నూల్ లో స్పష్టం చెయ్యాలని, ఈ ప్రభుత్వం చెయ్యకపోతే, వ్యతిరేకంగా మాకు ఓట్లు వేస్తారనే కల కనే రోజులు ఇవి కావని ఎవరు న్యాయం చెయ్యగలరో వారి వెంటనే నడుస్తాం, 67ఏళ్ళ పాలకుల మోసం చూసాం ఇక చూసే రోజులు కావు ఇవి అని పార్టీలు గుర్తించాలని ఎంవీఆర్పియస్ రాష్ట్ర అధ్యక్షులు బోయ పులికొండన్న ఒక ప్రకటనలో స్పష్టం చేశారు

### నాలుగో స్తంభం స్వేచ్ఛను కాపాడాలి..

## జర్నలిస్టులపై వేధింపులను ఖండిస్తున్నాం..

### బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందుల కృష్ణ అర్జున్ రావు



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

అశ్వాపురం: ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేయడం, వారిని వేధింపులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కందుల కృష్ణ అర్జున్ రావు అన్నారు.జర్నలిస్టులు ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు, స్థానికంగా జరుగుతున్న పరిణామాలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అన్నారు.వార్తలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గాల్లో వివరణ కోరే అవకాశం ఉందని, అయితే అందుకు భిన్నంగా జర్నలిస్టులపై కేసులు పెట్టడం, బెదిరింపులకు గురిచేయడం, వారి విధులకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.జర్నలిస్టులను ప్రత్యేకంగా టార్గెట్ చేస్తున్నారనే భావన ఎవరు కలిగించకూడదని కృష్ణ అర్జున్ రావు సూచించారు. వార్త రాసినందుకు జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం, వారి కుటుంబాలను ఆందోళనకు గురిచేసే పరిస్థితులు సృష్టించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు."ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టుల గొంతును నొక్కే ప్రయత్నాలను సహించేది లేదు. జర్నలిస్టులపై వేధింపులు కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలబడి అండగా ఉంటుంది" అని ఆయన పేర్కొన్నారు.అధికారులు ఈ వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. జర్నలిస్టుల హక్కులను గౌరవిస్తూ, వారికి స్వేచ్ఛగా విధులు నిర్వహించే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.పత్రికా స్వేచ్ఛను పరిరక్షించినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుందని, ప్రజల సమస్యలను ప్రశ్నించే గొంతుకలను కాపాడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని కందుల కృష్ణ అర్జున్ రావు అన్నారు.

## కన్నులపండువగా సీఎంసీ బోనాలు: అమ్మవారికి ప్రత్యేక పూజలు



**సైదరాబాద్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎన్‌పీసీ క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన బోనాల పండగ వేడుకలు భక్తిశ్రద్ధలు, సంప్రదాయ వైభవంతో కన్నులపండువగా సాగాయి. యుసిడి అదనపు కమిషనర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ల మార్గదర్శకత్వంలో ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాల్లో భాగంగా సీఎంసీ కార్యాలయం నుంచి పోచమ్మ ఆలయం వరకు స్వయం సహాయక సంఘాల మహిళలు సమర్పించిన 51 బోనాల శోభాయాత్ర, పోతురాజుల విన్యాసాలు, కోలాటాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ సృజనతో పాటు అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, చీఫ్ ఇంజనీర్, డిప్యూటీ కమిషనర్లు పోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలు ఆయురారోగ్యాలు, సమృద్ధితో వర్ధిల్లాలని ప్రార్థించారు. అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల కార్పొరేషన్‌కు ఉన్న కట్టుబాటును పునరుద్ఘాటించారు.

# నల్లచెరువులో నల్ల తుమ్మల మాయం...

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పాపట్ల నరహరి డిమాండ్



**యాదగిరిగుట్ట, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపల్లి నల్లచెరువులో గత కొన్ని రోజులుగా నల్ల తుమ్మ చెట్లు మాయమవుతున్నాయని, దీని వెనుక ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ యాదగిరిగుట్ట పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నల్లచెరువులోని తుమ్మ చెట్లు నరికివేసిన ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తుమ్మ చెట్లను నరికివేసి తీసుకువెళ్లిన ప్రాంతాలను, మిగిలిపోయి ఉన్న కొన్ని చెట్ల భాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నల్లచెరువులో గత కొన్ని రోజులుగా సుమారు రూ. 15 నుంచి 20 లక్షల విలువైన నల్ల తుమ్మ చెట్లను కొందరు వ్యక్తులు అక్రమంగా అర్ధరాత్రి వేళ నరికి తీసుకువెళ్లారని అన్నారు. వారిపై పోలీసులు, ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరి వెనుక ఎవరు ఉన్నారు అనే విషయంపై కూడా ఆరా తీసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుందరీకరణ పేరుతో ఈ విధంగా అక్రమంగా, ఎలాంటి అనుమతులు లేకుండా నల్ల తుమ్మ చెట్లను నరికి తీసుకువెళ్లడం చట్టవిరుద్ధమని అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ తరపున ఆయా అధికారుల కార్యాలయాలను ముట్టడించడమే కాకుండా, పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆరే శ్రీధర్ గౌడ్, దండేబోయిన వీరేష్ యాదవ్, ముక్కెర్ల సతీష్ యాదవ్, గ్యాదపాక క్రాంతి, మోత్కుపల్లి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# ఏటూర్ నాగారం ఐటిడిఏ ముట్టడి జయప్రదం చేయండి...

- 3 జీవోని పునరుద్ధరించి చట్టం చేయాలి..



**వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన ఏటూరు నాగారం ఐ టి డి ఏ  ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు నిచ్చింది.ఆదివాసీలు సాగులో ఉన్న పోడు భూములు ఎనిమిది లక్షల ఎకరాలకు పట్టాలు ఇవ్వాలని ఆదివాసి సంఘాల డిమాండ్ చేశాయి. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణంలో ఆదివాసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో జరగబోయే ఐటిడిఏ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, గోండ్వానా సంక్షేమ పరిషత్, ఆదివాసి నవనిర్మాణ సేన, తెలంగాణ భూమిపుత్ర ఆదివాసి సంఘం, అన్ని ఆదివాసి సంఘాలు నాయకులు వాలు పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు యాసం రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రలో పాలక ప్రభుత్వాలు ఆదివాసిల హక్కులను, చట్టాలను, నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు, శతాబ్దాలుగా ఆదివాసీలు ఈ దేశంలో ఈ భూమిపై నివసిస్తున్నారని, ఈ దేశం మూల వాసులైన ఆదివాసులదే అని ఆయన అన్నారు. వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని ఏజెన్సీ ప్రాంతంలో కఠినంగా అమలు చేయాలని, తద్వారా ఆదివాసీలకే కాకుండా ఆదివాసి యేతరులకు కూడా ఆ చట్టం రక్షించబడుతుందని తెలిపారు. ఈ చట్టం సవరించబడితే, తీసివేయబడితే ఏజెన్సీ ప్రాంతంలో పెట్టుబడిదారులు, భూస్వాముల వ్యవస్థ, పారిశ్రామికవేత్తలు, వలసలు పెరిగి స్థానిక గిరిజనులకు, గిరిజనేతరులకు నిలవ నీడ లేకుండా పోతుందని అన్నారు. వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని రక్షించుకోవడం అందరి బాధ్యత అని ఆయన అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ఏజెన్సీలో జీవో నెంబర్ 3ని పునరుద్ధరించి చట్టం చేయాలని ఆదివాసి సంఘాలుగా డిమాండ్ చేస్తున్నామని ఆయన అన్నారు.

అటవీ హక్కుల చట్టం ప్రకారం పోటు భూములకు పట్టాలు ఇవ్వాలని, సుమారు 8 లక్షల ఎకరాలకు పట్టాలు లేవని, పోడు కొట్టుకొని సాగులో ఉన్న ఆదివాసీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రవణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధబోయిన సర్వేశ్వరరావు, కుచ్చింటి చిరంజీవి, బొగ్గుల బిక్షపతి, ఆదివాసి నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నరసింహమూర్తి, జిల్లా అధ్యక్షులు మహేష్, గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్, తెలంగాణ భూమిపుత్ర ఆదివాసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూనెం రామచందర్, ఆదివాసి అడ్వకేట్ చింత సమ్మయ్య,పూనెం సూర్యం, మంగపేట మండల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు, కార్మిక, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి



**నల్లబెల్లి ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** 17 రైతు కార్మిక నిరుద్యోగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింత కింది కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం తహసిల్దార్ కార్యాలయంలో సిపిఐ సిపిఎం ఆధ్వర్యంలో తహసిల్దార్ ముప్పు కృష్ణకు మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ ను రద్దు చేసి, పదిలక్షల ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలన్నారు. దేశంలో పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కల్తీ లేని విత్తనాలు కాంప్లెక్స్ ఎరువులు అందించాలని, కరువు ప్రాంతాల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ, సిపిఎం నాయకులు కుమారస్వామి, కడియాల మనోహర్ లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల మండల కమిటీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని, 35శాతమే పంటలు కొంటామనీ కేంద్రం చెప్పడం రైతు వ్యతిరేక విధానాలను అమలు చేయడమే అవుతుందన్నారు. వందశాతం పంటలు కొనుగోలు చేయాలని, పంట నిల్వలకు సరిపడా గోదాములు నిర్మించాలన్నారు. దశాబ్దాల తరబడి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావడానికి వెంటనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు పంపగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం లేబర్ కోడ్ లను అమలు చేస్తామని చెప్పడం కాంగ్రెస్ బీజేపీలు ఇద్దరూ కార్మిక వ్యతిరేకులేనని తేలిపోయిందన్నారు. తక్షణమే లేబర్ కోడ్ లను ఉపసంహరించుకోవాలని, కార్మిక సంక్షేమం అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ నెరవేర్చకపోగా నేటికీ ఖాళీగా ఉన్న పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకపోవడమంటే నిరుద్యోగ యువతకు వెన్నుపోటు పొడవడమే అన్నారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నల్లబెల్లి మండల తహసిల్దార్ తో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం మండల నాయకులు బొడిగె సమ్మయ్య, మామిళ్ల పెద్ద ఐలయ్య, కడియాల క్రాంతి కుమార్, ఇస్లావత్ రవి, ఆవాల సంపత్రావు, గట్టి పాపయ్య, మద్రి రమేష్, బొడిగె నారాయణస్వామి, దిండు బాబు, కనకం సాగర్, కత్తి సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాల్సిందే!

- ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చించాలి
- పనివేళలు, జీతాలు, ఓవర్‌టైమ్‌లో వివక్షను అరికట్టాలి
- తెలంగాణ రక్షణ సేన నర్సులకు అండగా ఉంటుంది
- తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నర్సులు, ఆస్పత్రి సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించి వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో తనను కలిసిన ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సులతో కల్వకుంట్ల కవిత సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నర్సులు ఎదుర్కొంటున్న పని ఒత్తిడి, హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోవడం, జీతాలు, పనివేళలు, ఓవర్‌టైమ్ తదితర అంశాలపై చర్చించారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రజల నుంచి పెద్ద ఎత్తున వైద్య ఖర్చులు వసూలు చేస్తున్నప్పటికీ, అదే ఆస్పత్రుల్లో సేవలందిస్తున్న సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం సరికాదని కవిత అన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి రోగులకు సేవలందించే నర్సులకు కనీసం హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో చర్చించి నర్సులు, సిబ్బందికి తప్పనిసరిగా హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనివేళలు, జీతాలు, ఓవర్‌టైమ్ వంటి అంశాల్లో తెలంగాణకు చెందిన ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తూ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ప్రాధాన్యం ఇస్తున్నారనే ఆరోపణలపై కూడా కవిత మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ప్రైవేట్ ఆస్పత్రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

నర్సులు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బంది హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం అండగా ఉంటుందని కవిత హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

# ఆరూరులో దివంగత తుమ్మల నరసయ్య 3వ వర్ధంతి



**వలిగొండ, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** దివంగత సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ తుమ్మల నరసయ్య 03 వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఆయన స్వగ్రామమైన నరసయ్య గూడెం ఆరు గ్రామాలలో ఘనంగా నిర్వహించారు ఈ రెండు గ్రామాలలో ఉన్న తుమ్మల నరసయ్య విగ్రహానికి పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ మాట్లాడుతూ తుమ్మల నరసయ్య సుదీర్ఘంగా కాంగ్రెస్ పార్టీలో ఏళ్ల తరబడి పార్టీ కోసం పని చేసి చివరి ప్రాణం పోయే వరకు కూడాకాంగ్రెస్ పార్టీ జెండాను వదలలేదని వారన్నారు ఆయన కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరిచిపోలేని మని ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని కోరారు ఆయన బ్రతికున్నంత కాలం నిరంతరం ప్రజల మధ్యనే ఉండి పార్టీకి నిస్వార్థంగా సేవలందించాడని ఆయన చేసిన సేవలు ఏనాడు కూడా చెదిరిపోనివని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు వలిగొండ సింగల్ విండో చైర్మన్ గరిసె రవి మత్స్యగిరి గుట్ట చైర్మన్ తుమ్మల శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ వలిగొండ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు నాయకులు చిట్టెడి జనార్ధన్ రెడ్డి గంగాపురం సతీష్ కాసుల వెంకన్న గౌడ్ గుండు దానయ్య వలిగొండ సింగిల్ విండో వైస్ చైర్మన్ జంగారెడ్డి ఐటి పాముల రవీంద్ర బాల శంకర్ మచ్చ గిరి గుట్ట డైరెక్టర్లు రాధారపు రమేష్ కూర వెంకన్న జినుకల దానయ్య బందారు నరసింహారెడ్డి నరసయ్య కుటుంబ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరి సాగులో అప్రమత్తం అవసరం అధిక విస్తీర్ణంలో వరి సాగు వద్దు

- రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించిన దేవరకద్ర ఎమ్మెల్యే జీఎమ్ఆర్



**దేవరకద్ర ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, రానున్న రెండు నెలల్లో ఇది మరింత పెరిగి వర్షాలు తగ్గే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని జీఎమ్ఆర్ తెలిపారు. రైతులు ముందుచూపుతో ఆరుతడి, పామాయిల్, కూరగాయల పంటల వైపు మళ్లాలని సూచించారు. 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు జీఎమ్ఆర్ హాజరై మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు నాటికి నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురవగా ఈ సారి మాత్రం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. గత ఏడాది కంటే కూడా ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదు అయింది. ఈ ఏడాది వరికి సరిపడా నీరు అందే పరిస్థితి ఉండకపోవచ్చని భూగర్భ జలాలు సహితం తగ్గుతున్నాయని హెచ్చరించారు. కావున రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలన్నారు.

## పాము కాటుకు గురైన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**దేవరకద్ర, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్రలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాల/జూనియర్ కళాశాలలో పాము కాటుకు గురైన విద్యార్థి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ ఆసుపత్రిని మంగళవారం సందర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, అందుతున్న చికిత్స వివరాలను సమీక్షించారు. విద్యార్థి చికిత్సకు స్పందిస్తున్నాడని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థిని నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన వైద్యసేవలు అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదిత స్థల పరిశీలన

- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ



**మహబూబ్‌నగర్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** హన్వాడ మండల కేంద్రంలోని 2బీహెచ్‌కే ఇళ్లకు ఆనుకుని ఉన్న ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు కేటాయించేందుకు ప్రతిపాదించిన స్థలాన్ని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా హన్వాడ తహసీల్దార్, మండల సర్వేయర్‌తో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, భూమికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఏర్పాటుకు స్థలం అనువుగా ఉందా, భూమి విస్తీర్ణం, సరిహద్దులు తదితర అంశాలపై వివరాలను సేకరించారు.ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించి, పాఠశాల ఏర్పాటుకు అనువైన స్థలంగా ఉందా అనే అంశంపై అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

## రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశాన్ని జయప్రదం చేయండి



**వలిగొండ, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** 13 మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజు లు పిలుపునిచ్చారు మంగళవారం రోజున మండల కేంద్రంలోని జిల్లా విస్తృతస్థాయి సమావేశ కరపత్రాలను ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతుల ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్ తో పాటు స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని నవంబర్ 18 నుండి 22 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలను నిర్వహించడం జరుగుతుందని ఈ మహాసభలను విజయవంతం చేసేందుకు జిల్లాస్థాయి విస్తృత సమావేశాన్ని వలిగొండ మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జాతీయ నాయకులు ఎస్ వీరయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, రాష్ట్ర నాయకులు ఎండి జహంగీర్ లు పాల్గొననున్నారని ఈ సమావేశానికి రైతు సంఘం జిల్లా మండల కమిటీ సభ్యులు మరియు ఇతర ప్రజాసంఘాల జిల్లా మండల కమిటీ సభ్యులు హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిర్పంగి స్వామి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డి, జిల్లా నాయకులు గన్నేబోయిన విజయభాస్కర్,దయ్యాల మల్లేశం, పల్లె సత్యం, పరకాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## "రైతులతో మాట - పంట మార్పిడికి బాట" కార్యక్రమం



**మఠంపల్లి, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** "రైతులతో మాట -- పంట మార్పిడికి బాట" కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని యాతవాకిళ్ళ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి,మండల యంఆర్ఐ జానీ పాషా మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటివరకు ఎలాంటి పంట సాగు చేయని రైతులను కలిసి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు, పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల ఎంపికపై విస్తృతంగా చర్చించారు.రైతులు సాగు చేయకుండా ఉన్న భూములను పరిశీలించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూమి స్వభావం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అనువైన పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు.పంట మార్పిడి ద్వారా భూసారం పరిరక్షణతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించారు.అదే విధంగా ఒకే పంటను సాగు చేయడం వలన నేల సారం తగ్గిపోతుందని ముఖ్యంగా వరి పంటలో అధికంగా యూరియా వినియోగించడం వలన భూ సారం దెబ్బతినడంతోపాటు సాగు ఖర్చులు పెరిగే అవకాశం ఉందని తెలిపారు.పంట మార్పిడితో పాటు అవసరం మేరకు ఎరువులను వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షేక్ యాకుబ్,వీఆర్ఏ జానీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్తపల్లి ప్రభాకర్,కరుణాకర్ రెడ్డి,రైతులు సాముల నర్సిరెడ్డి,సైదిరెడ్డి,పోలిశెట్టి శేఖర్,అవిరేణి ముత్తయ్య,మహిళ రైతులు కొత్తపల్లి సాయమ్మ,సైదమ్మ, ఉషరాణి,ఒద్దుల వెంకట రమణ,అగ్నేసు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వాహనాల వేలం

**కల్వకుర్తి, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆగస్టు 12, బుధవారం ఉదయం 11 గంటలకు వాహనాల వేలం నిర్వహణ జరగనుంది. వేలంలో భాగస్వామ్యానికి ఆసక్తి ఉన్న ప్రజలు మరియు వారికి సంబంధించిన అధికారులందరూ సమయానికి హాజరుకావాలని సీఐ విజ్ఞప్తి చేశారు. అదనపు వివరాలకు లేదా నమోదు సంబంధి సమాచారానికి స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సంప్రదించలని ఎక్సైజ్ జె వెంకటరెడ్డి తెలిపారు.

# చేయూత పెన్షన్ దరఖాస్తులకు ఈ నెల 31 వరకు చివరి గడువు

- డేటా ఎంట్రీలో తప్పులు చేస్తే చర్యలు తప్పవు.
- ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి.
- మండల స్థాయిలోనే ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో చేయూత పెన్షన్ పథకానికి అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి, ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, డీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయూత పెన్షన్ దరఖాస్తులను ఈ నెల 31 వరకు స్వీకరించాలని సూచించారు. దరఖాస్తులను మాడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేసి, డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు



తీసుకోవాలని ఆదేశించారు. దరఖాస్తులను ఏ లాగిన్‌లో ఎవరు నమోదు చేశారనే వివరాలు రికార్డవుతాయని, తొందరపాటుతో తప్పుడు సమాచారం నమోదు చేయవద్దని అధికారులను హెచ్చరించారు. స్వీకరించిన దరఖాస్తులను తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హతను నిర్ధారించాలని తెలిపారు. అలాగే జిల్లాలో మొదటి విడత పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫారాలను ఆయా పాఠశాలలకు అందించాలని, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి, సాధ్యమైనంత వరకు దరఖాస్తులను మండల స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎంపీడీవోలు తమ పరిధిలోని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతి, ప్రజావాణి ద్వారా అందుతున్న దరఖాస్తుల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, జెడ్పీ సీఈఓ సుదీర్, డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ ఉమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కొత్త పింఛన్లకు దరఖాస్తుల ఆహ్వానం

- అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి : రామన్నగారి రాఘవేందర్‌గౌడ్



**మేడ్చల్ ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో నేటి నుంచి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకం కింద కొత్త పింఛన్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ సామాజిక భద్రత ప్రతి ఒక్కరి హక్కు అనే ఉద్దేశంతో అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన కుటుంబాలకు పింఛన్ ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాఘవేందర్ గౌడ్ సూచించారు. మేడ్చల్ డివిజన్ పరిధిలోని అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఈత కల్లు గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితరులతో పాటు పైలేరియా, డయాలసిస్ వంటి వ్యాధులతో బాధపడుతున్న అర్హులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. పింఛన్‌కు అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ పొందని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో అర్హతకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించాలని రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, నిరుపేద కుటుంబాలకు చెందిన అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాఘవేందర్‌గౌడ్ కోరారు.

# తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక బోనాలు

- అన్నసంతార్పణ కార్యక్రమంలో పాల్గొన్న కొలుకుల జైహింద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీకగా బోనాల పండుగ నిలుస్తుందని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. రోడామిస్త్రీ నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ లోని అమ్మవారి ఆలయంలో బోనాల పండుగను పురస్కరించుకొని భక్తులు సమర్పించిన ఓడిబియన్ని మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాల్గొన్న కొలుకుల జైహింద్ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తి ప్రజలపై అమ్మవారి చల్లని దీవెనలు తప్పక ఉంటాయన్నారు. తెలంగాణలో అమ్మవారి బోనాల పండుగ ప్రసిద్ధిగాంచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ, నర్సింగ్, సంతోష్,మురళి, ప్రభాకర్, నాగరాజు, యాదగిరి, విగ్నేష్, సీతారాములు, ఖయ్యూం, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## రాంగోపాల్ పేట్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ



**రాంగోపాల్ పేట్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** రాంగోపాల్ పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్లో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వం నాణ్యతలేని చీరలను పంపిణీ చేసిందని... కానీ ఇప్పుడున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద మహిళల కోసం నాణ్యమైన ఇందిరమ్మ చీరలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని... రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నగరంలో కాంగ్రెస్ పార్టీ జండా ఎగురుతుందని ఈ సందర్భంగా వారు ధీమా వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో ఆర్పీ కస్తూరి ,అంబేద్కర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ మహిళలు పాల్గొన్నారు.

# గాయత్రి డిగ్రీ కళాశాలలో ఘనంగా బోనాల ఉత్సవం



**మేడ్చల్ ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడ్చల్ లోని గాయత్రి డిగ్రీ కళాశాలలో మంగళవారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థినులు పట్టణంలోని ఏడు గుడుల దేవాలయంలో కొలువైన అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బోనాల పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థినులకు తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినుల సంప్రదాయ వస్త్రధారణ, బోనాల అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు గణేష్, శివ, కమలాకర్ రెడ్డి, దేవరాజ్, సత్యనారాయణ, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక మోదీ సర్కారుకు కాలం చెల్లింది

- ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు : ఈ.టి.నరసింహ
- ప్రజాస్వామ్యాన్ని అణచివేస్తున్న బీజేపీ ప్రభుత్వం-స్టాలిన్




**సికింద్రాబాద్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మంగళవారం చిలకలగూడ నుంచి వారాసిగూడ వరకు పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ఈటీ నరసింహ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, రైల్వే, విమానయాన రంగాలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. నీట్ వంటి పరీక్షలను కేంద్రీకృతం చేయడం వల్ల పేపర్ లీకేజీలు, అవకతవకలకు అవకాశం ఏర్పడుతోందన్నారు. వాటిపై ప్రశ్నించే విద్యార్థులపై కేసులు పెట్టడం, లాఠీచార్జి చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యార్థులను 'యాంటీ నేషనల్', అర్బన్ నక్సల్స్'గా ముద్ర వేసి యూఏపీఏ వంటి చట్టాలతో అణచివేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని ఆరోపించారు. 8 గంటల పనివిధానాన్ని 12 గంటలకు పెంచి కార్మికుల శ్రమను దోచుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'బద్లావ్ జరూరీ హై' కార్యక్రమానికి ప్రజలు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ తో పాటు కొమురెల్లి బాబు, ఉమార్‌ఖాన్, సోమయ్య, నరసయ్య, సయ్యద్ గౌస్, యాకయ్య, బిక్షపతి, నాగమణి, పద్మ, లక్ష్మి, లెనిన్, జోసెఫ్ భాను, అనిల్, కళ్యాణ్, అరుణ్, అంబాల శ్రీనివాస్, రషీద్, వంశీ, రాజు, కుమార్, రవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# 765 కేవీ లైన్ బాధిత రైతులకు ఎమ్మెల్యే భరోసా!

- ప్రస్తుత విలువ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి
- కడ్తాల్ హైటెన్షన్ లైన్ బాధిత రైతుల వినతి



**కడ్తాల్ ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** బీదర్ టూ మహేశ్వరం 765 కేవీ హైటెన్షన్ లైన్ నిర్మాణంతో ప్రభావితమవుతున్న రంగారెడ్డి జిల్లా కడ్తాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాధిత రైతులు కడ్తాల్ సర్పంచ్ రాయికంటి బిక్షపతి, ఉపసర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం తమ సమస్యను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు మంగళవారం రైతులంతా ఎమ్మెల్యేను కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. 765 కేవీ హైటెన్షన్ లైన్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుతం ఉన్న భూముల వాల్యుయేషన్ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యేను కోరారు. తమ భూములకు తగిన పరిహారం అందకపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు.

**- అధికారులకు ఫోన్.. పరిహారంపై ఆదేశాలు**

రైతుల సమస్యలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా విన్నారు. వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యపై మాట్లాడారు. బాధిత రైతులకు న్యాయబద్ధంగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు. రైతులకు అన్యాయం జరగకుండా చూస్తానని, నష్టపరిహారం విషయంలో వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

**- రైతులకు అండగా ఉంటా..**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులకు ధైర్యం చెబుతూ.. అభివృద్ధి పనులకు భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. "రైతులకు నేను అండగా ఉంటా.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అంటూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, బాధిత రైతులు కందికంటి కేశవులు గౌడ్, వెంకట్రాములు గౌడ్, కాంటేకర్ శ్రీనివాస్, పాండు యాదవ్, శంకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మారు బోనం..



**రాంగోపాల్ పేట్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి మంగళవారం మారు బోనం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది . ఈ కార్యమానికి దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి జోగినీలతో కలిసి మారు బోనంను ఎత్తుకున్నారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి బోనం పెట్టారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమత్ రావు, ఆర్ జె సి రామకృష్ణ, ఆలయ ఈవో గుత్తా మనోహర్ రెడ్డి, ఆలయ వేద పండితులు వేణుమాధవ శర్మ, జోగినీలు నిషా క్రాంతిలు పాల్గొన్నారు. డోలు వాయిద్యాల మధ్య అమ్మవారికి బోనంను సమర్పించారు .

**- ఆలయంలో పెరిగిన భక్తుల రద్దీ**

శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో మంగళవారం భక్తులు రద్దీ కొనసాగింది. ఆషాడ మాసం నేటితో ముగియనుండడంతో అమ్మవారి దర్శించుకునేందుకు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం తదితర మొక్కులను తేల్చుకున్నారు.



# అంబేద్కర్ కాలనీ వద్ద బస్సులు ఆపాలి

- బీజేపీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు కాలనీవాసుల వినతి



**శామీర్ పెట్ ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** లాల్‌గాడి మలక్‌పేట్ అంబేద్కర్ కాలనీ వద్ద ఆర్టీసీ బస్సులు నిలపాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో కాలనీవాసులు హకీంపేట్ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కైరా గణేష్ మాట్లాడుతూ గత జూలై 20న అంబేద్కర్ కాలనీ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు నిలపడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదన్నారు. ఈ విషయమై మరోసారి అంబేద్కర్ కాలనీవాసులతో కలిసి కౌన్సిలర్ గణేష్ డిపో మేనేజర్‌ను కలిసి సమస్యను వివరించారు. కాలనీ వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అంతేకాకుండా కొందరు బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో దురుసుగా మాట్లాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలనీవాసుల సమస్యలను విన్న డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ ఇకపై అంబేద్కర్ కాలనీ రిక్వెస్ట్ స్టాప్ వద్ద బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించే డ్రైవర్లు, కండక్టర్లపై కూడా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసినట్లు కాలనీవాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

- ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి: బక్కా శంకర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బక్కా శంకర్ రెడ్డి అన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం షాపూర్ నగర్ లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బక్క శంకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా మన ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు పత్తి రఘుపతి, డివిజన్ అధ్యక్షులు కేశవ్ యాదవ్, సాయి జశ్వంత్, ప్రశాంత్, తిరుపతి దాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి



**వికారాబాద్, ఆగస్టు 12 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లాలో వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు సంబంధించి వరి కొనుగోలు కేంద్రాలను ముందస్తుగానే సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖరీఫ్ సీజన్ వరి ధాన్యం సేకరణకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ఖరీఫ్ సీజన్‌లో దొడ్డు, సన్న రకం వరి ధాన్యం సేకరణ జరగనున్నందున, అందుకు అనుగుణంగా అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలతో పాటు అవసరమైన గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ధాన్యం నిల్వకు అవసరమైన గోదాంలను కూడా ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగితే ధాన్యం సేకరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుందని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా లో ప్రతి రైస్ మిల్లుకు 60 మంది హమాలీలకు తగ్గకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటాచారి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కవిత, డీసీఓ శ్రీనివాస్, అదనపు డీఆర్‌డీఓ నర్సింలు, డీసీఎంఎస్ రమణారెడ్డి, డీటీసీఎస్ విజయలక్ష్మి తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపులు

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 13న తాడేపల్లి పట్టణంలోని ప్రకాశం బ్యారేజీ సమీపంలో కేఎల్ రావు కాలనీ వద్ద నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా గుంటూరు జిల్లా పోలీసులు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నారు.

విజయవాడ నుంచి ఉండవల్లి వైపు ప్రకాశం బ్యారేజీ మీదుగా వెళ్లే వాహనదారులు ప్రకాశం బ్యారేజీ చెక్‌పోస్టు డౌన్, సీతానగరం ఘాట్, రామకృష్ణ మిషన్ స్కూల్ రోడ్డు, ఉండవల్లి స్క్రూ బ్రిడ్జి మీదుగా ఉండవల్లి సెంటర్‌కు చేరుకోవచ్చు.

ఉండవల్లి నుంచి విజయవాడ వెళ్లే వాహనాలు ఉండవల్లి సెంటర్, స్క్రూ బ్రిడ్జి, బోట్‌యార్డ్, రైల్వే అండర్‌పాస్, ఎన్టీఆర్ కట్ట, ఓల్డ్ టోల్‌గేట్ సెంటర్ మీదుగా విజయవాడకు వెళ్లాలి.

తాడేపల్లి బైపాస్ నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా విజయవాడ వెళ్లే వాహనాలు ఓల్డ్ టోల్‌గేట్ సెంటర్, ఎన్టీఆర్ కట్ట, పట్టాభి సీతారామయ్య రోడ్డు, మహానాడు రోడ్డు నంబర్-3, సీతానగరం ఘాట్, ప్రకాశం బ్యారేజీ చెక్‌పోస్టు మీదుగా వెళ్లేందుకు పోలీసులు సూచించారు.

తాడేపల్లి బైపాస్ నుంచి హైకోర్టు, సచివాలయానికి విధులకు వెళ్లే ఉద్యోగులు ఓల్డ్ టోల్‌గేట్ సెంటర్, ఎన్టీఆర్ కట్ట, రైల్వే అండర్‌పాస్, బోట్‌యార్డ్, స్క్రూ బ్రిడ్జి, ఉండవల్లి సెంటర్ మీదుగా సచివాలయం వైపు వెళ్లవచ్చని తెలిపారు.

మంగళగిరి నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ఎయిమ్స్ మీదుగా సాయిబాబా గుడి, వడ్డేశ్వరం, దీపికా హైవే మీదుగా విజయవాడకు వెళ్లాలని సూచించారు.

తాడేపల్లి నుంచి విజయవాడ వెళ్లే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు డోలాస్ నగర్, ప్రకాశ్ నగర్, నులకపేట, ముగ్గు రోడ్డు, రైల్వే గేట్, కొత్తూరు, భారతమాత సెంటర్, ఓల్డ్ టోల్‌గేట్ సెంటర్ మీదుగా విజయవాడకు చేరుకోవచ్చు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, హైకోర్టు న్యాయవాదులు, హైకోర్టు సిబ్బంది ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించాలని గుంటూరు జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు. వాహనదారులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ శారద వెల్లడి



- ○ డాక్టర్ శారద సొసైటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో రోడ్లు వెంట ఉన్న వ్యర్థాలను తొలగించి మొక్కలు నాటిన వైనం

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో డాక్టర్ శారద సర్వీసెస్ ఆధ్వర్యంలో పట్టణంలోని బుర్రిపాలెం రోడ్డుకి సుమారు ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డుకి ఇరువైపులాఉన్న చెత్తను, వ్యర్థాలను తొలగించి రోడ్డుకి ఇరువైపులా చెట్లను నాటే కార్యక్రమం నిర్వహించారు.

డాక్టర్ శారద మాట్లాడుతూ శారద సొసైటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో జెసిబి మిషన్స్ ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకొని మున్సిపాలిటీ వారి అనుమతితో ఎమ్మార్వో, ఎంపీడీవో వారి సహకారముతో రోడ్డుకి ఇరువైపున ఉన్నటువంటి చెత్తను, వ్యర్థాలను తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజలు కూడా తమ బాధ్యతగా రోడ్లుకు విలువైపులా చెత్తాచెదారాలను, వ్యర్థాలను వేయకుండా, వాతావరణ కాలుష్యా పరిరక్షణతో పాటుగా ప్రభుత్వంతోపాటుగా స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రజల సహకరించాలని ఆమెకోరారు . అదేవిధంగా ప్రజలు రోడ్ల మీద ఎలాంటి వ్యర్థాలు వేయకుండా ఉండాలని ఆమె సూచించారు. అదేవిధంగా ఈ రోడ్డును మోడరన్ రోడ్డుగా తయారు చేయాలని రోడ్డుకి ఇరువైపులా చెట్లను నాటే కార్యక్రమం చేపట్టినట్టు డాక్టర్ శారద తెలియజేశారు ఈ కార్యక్రమంలో పి ఎస్ ఆర్ కాలేజ్ అధ్యాపకులు నన్ను సుగుణ, పాటిబండ్ల విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): పట్నంలోని 11ఎం విద్యుత్ లైన్ లకు మరమ్మతలు మరియు లైనులకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే క్రమంలో తెనాలి టౌన్ లోని నాజర్ పేట, రామలింగేశ్వరపేట మరియు గురువయ్య కాలనీలోని ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలియజేశారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## రామిరెడ్డి తోటలో అభివృద్ధికి రాచబాట : ఎమ్మెల్యే నసీర్

- ○ అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం
- ○ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషాలు
- ○ రూ.1.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):గత వైసీపీ పాలనలో కనీసం రోడ్లకు కూడా నోచుకోని ప్రాంతాల రూపురేఖలు మారుస్తున్నామని, రామిరెడ్డి తోటలో అభివృద్ధికి రాచబాట పరుస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక రామిరెడ్డిపేట, ఇమ్మానియేల్ పేట ప్రాంతాల్లో రూ. 1.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ నందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ప్రజల ఆలోచన మేరకు గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని డివిజన్లలో అభివృద్ధితోపాటు శానిటేషన్ పైనా దృష్టి సారించామని చెప్పారు. రామిరెడ్డి తోట ఇమ్మానుయేల్ పేట ప్రాంతాలలో వరుసపనీరు పడితే బురదమయంగా మారుతాయి అని చెప్పారు శానిటేషన్ మురుగునీటి ప్రవాహం లేక దోమల వ్యాప్తి చెందుతాయని ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు డ్రైన్లు రోడ్ల నిర్మాణంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు ఉన్న ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందన్నారు. తల్లికి వందనం నిధులు జమ కావడంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులకు బెంగ లేకుండాపోయిందని తెలిపారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నారని చెప్పారు. నేడు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నారని, దీని ద్వారా విద్యార్థుల సామర్థ్యాల మదింపు సాధ్యమవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో విద్యార్థులు పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా పునాదులు వేస్తున్నారన్నారు. తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా పాఠశాలల్లో ఇబ్బందులు తలెత్తితే వెంటనే తనను సంప్రదించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కూటమి నాయకులతో కలిసి పర్యటిస్తున్నామని, ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని అన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాల సమయంలోనే కాకుండా ప్రతి రోజూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని, గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## పొన్నూరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



పొన్నూరు (జర్నలిస్ట్ ఫైల్): విద్యుత్ చౌర్యం, అక్రమ విద్యుత్ వినియోగంపై విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలు బుధవారం పొన్నూరు పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించాయి. గుంటూరు పర్యవేక్షక ఇంజినీర్ సీహెచ్. రమేష్ ఆధ్వర్యంలో 38 బృందాలు తనిఖీల్లో పాల్గొన్నాయి. 38 మంది అధికారులు, 114 మంది సిబ్బంది 2,757 విద్యుత్ సర్వీసులను పరిశీలించారు. అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇద్దరిని గుర్తించి రూ. 50 వేలు, అనుమతించిన కేటగిరీకి భిన్నంగా వినియోగిస్తున్న ఒకరికి రూ. 30 వేలు, అనుమతించిన లోడుకు మించి వినియోగిస్తున్న 145 మందికి రూ. 4.54 లక్షలు, వాస్తవ వినియోగం కంటే తక్కువగా బిల్లు నమోదైన ఒకరికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 5.34 లక్షల అపరాధ రుసుము విధించారు. ఈ వివరాలను డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్. వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆ. సత్యనారాయణ తెలిపారు.

విద్యుత్ మీటర్లకు సీలు తప్పనిసరిగా ఉండేలా వినియోగదారులు చూసుకోవాలని అధికారులు సూచించారు. సీలు లేకపోయినా, తుప్పుపట్టి ఊడిపోయినా వెంటనే సంబంధిత సిబ్బందికి లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఉద్దేశపూర్వకంగా సీలు తొలగించడం, మీటర్‌కు గాట్లు పెట్టడం, పనిచేయని మీటర్ ద్వారా విద్యుత్ వినియోగించడం వంటి చర్యలను విద్యుత్ చౌర్యంగా పరిగణించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొదటిసారి తప్పిదానికి చట్టప్రకారం కాంపౌండింగ్ అవకాశం ఉంటుందని, రెండోసారి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జరిమానా చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం కింద ఆస్తులు జప్తు చేసే అవకాశం ఉందన్నారు. విద్యుత్ చౌర్యంపై 9440812263, 9440811 నంబర్లకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తనిఖీల్లో డీఈఈలు బీ. అశోక్‌కుమార్, ఎన్. మల్లిఖార్జున ప్రసాద్, కే. రవికుమార్, ఏఈ ఆర్.వీ. శంకర్, ఏఈఈలు యు. శివశంకర్, ఎం. సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలి



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్): ఆగస్టు 15 స్వాతంత్ర్య సందర్భంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ. ఆంజనేయులు కోరారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో భాగంగా బుధవారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయం వద్ద నుండి సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేయగా చీఫ్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ స్థానిక శివయ్య స్తూపం వరకు" హర్ ఘర్ తిరంగా" సైకిల్ ర్యాలీ కొనసాగించారు. చీఫ్ విప్ జీవి విద్యార్థులతో జాతీయ జెండా లు చేత పూడి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం అనేది కుల,మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా జరుపుకునే జాతీయ పండుగ అని స్పష్టం చేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశభక్తికి, ఐక్యతకు ప్రతీక అన్నారు. అజాధికా అమృత్ మహోత్సవ్ లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2020 నుండి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర సమరయోధులను ప్రతి ఒక్కరు గౌరవించుకోవాలని కోరారు. కుల మత ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ ఒకే జెండా కిందకు రావడం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందించాలన్నారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను, గౌరవించే విధానాన్ని ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలని అన్నారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయకులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం



- ○ ఎమ్మెల్యే డా బూర్ల రామాంజనేయులు

కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా కాకుమాను మండలం పరిధిలోని గార్లపాడు, పెద్ది వారి పాలెం, బోడిపాలెం, కోతివానిపాలెం గ్రామంలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ముందుగా గార్లపాడు గ్రామంలో రూ. 27 లక్షల జడ్పీ నిధుల టైడ్ గ్రాంట్ నిధులతో నిర్మించనున్న అంతర్గత డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన,రూ. 10 లక్షల ఎన్‌ఆర్జీఎస్ నిధులతో నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి, గత రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలు అడిగి తెలుసుకుని త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఇటీవల ప్రత్తిపాడు వైసీపీ ఇంచార్జి చేసిన ఆరోపణలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్లలో రోడ్ల అధ్వానంగా గుంతల మయంగా ఉంటే ఒక తట్టెడు మట్టి కూడా వేయని ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఏడుసార్లు ఆర్టీసీ చార్జీలు పెంచిన ప్రభుత్వం మీది, ఆడబిడ్డలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించేది కూటమి ప్రభుత్వం. 500 రూపాయల గ్యాస్ సిలిండర్లను 1200 రూపాయలు చేసిన ప్రభుత్వం మీది, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసే ప్రభుత్వం మీ కంటికి ఇది కనపడటం లేదా అన్నారు. గుంటూరు ఛానల్ పనులు జరుగుతుంటే అది మీకు కనపడటం లేదా,నల్లమడ వాగును మంజూరు చేయించి దాన్ని కూడా పూర్తి చేసి చూపిస్తాం అన్నారు . ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు ప్రత్తిపాడు నియోజకవర్గంలో చేపడుతుంటే అవన్నీ మీకు కనిపించడం లేదా ఇప్పటికైనా కళ్ళు తెరవండి అని తెలిపారు . ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వమే ధ్యేయం! ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత!



తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో తెనాలి నియోజకవర్గానికి చెందిన పలువురికి వైద్య ఖర్చు నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మొత్తం రూ. 4,30,285/- మంజూరైంది. కందలం ప్రసన్నకు రూ. 3,31,301/-,

దేవరకొండ వెంకటేశ్వర్లు కు రూ .3,31,301/- ఉన్నం విజయ కు రూ. 49,492/-,కారుమంచి మరియమ్మ లకు రూ. 49,492/-. ఆర్థిక సహాయానికి సంబంధించి వారికి చెక్కులను పలువురు టీడీపీ నాయకులుఅందజేశారు. ఈ సందర్భంగా ఆపదసమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయాన్ని పొందిన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్యక్రమంలోపట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్,మున్సిపల్ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ పసుపులేటి త్రిమూర్తి వసంతం అశోక వర్ధన,మల్లవరపు విజయ్,గాజుల సారధి,కన్నయ్య,షావుల్,చొప్పర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజీఈఏ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



దుగ్గిరాల(జర్నలిస్ట్ ఫైల్): ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఏపీజీఈఏ అధ్యక్షుడు టి.వి. రామిరెడ్డి తెలిపారు. ఎన్నికల అధికారిగా టి. లక్ష్మీనారాయణ, సహాయ ఎన్నికల అధికారిగా ఈశ్వర ప్రసాద్, పరిశీలకుడిగా వి. పెద రత్తయ్య వ్యవహరించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా గుంటూరు పూర్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బొల్లంపల్లి బుజ్జి ఎన్నికయ్యారు. సహాధ్యక్షుడిగా పి. ప్రకాశరావు, ఆర్థిక కార్యదర్శిగా నూకవరపు శ్రీలక్ష్మీకుమారి, ఉపాధ్యక్షులుగా నజీర్ అహ్మద్, ఆదిలక్ష్మి, డి. ఝాన్సీరాణి ఎన్నికయ్యారు.

జాయింట్ సెక్రటరీలుగా ఎన్. లలిత, కె. రఫీ, జి. వీరయ్య, ఎస్. నాగముని నాయక్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ ఎన్నిక సందర్భంగా ఏపీజీఈఏ దుగ్గిరాల యూనిట్ మాజీ అధ్యక్షుడు అందెబాల చంద్ర మౌళి, మాజీ సహాధ్యక్షుడు వంకదార సుబ్బారావు, తెనాలి యూనిట్ అధ్యక్షుడు దగ్గుబాటి సుధీర్, మాజీ అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు నాంచారయ్య నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## జీజీహెచ్‌లో జూనియర్ వైద్యుల సమ్మె ఉధృతం

- ○ రెండు రోజులుగా ప్రభుత్వం-వైద్యుల చర్చలు విఫలం
- ○ అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలకు విరామం
- ○ ఉపకార వేతనం పెంచాలి.. పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచొద్దని ఆందోళన
- ○ ఏపీ జూడా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్ శంకర్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం చేపట్టిన సమ్మె బుధవారం ఉధృతమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేసి నిరసన కొనసాగిస్తున్నారు. అత్యవసర చికిత్సలు, అత్యవసర శస్త్రచికిత్సలు, అత్యవసర విభాగాల్లో సేవలను మాత్రం కొనసాగిస్తున్నారు. దీంతో సాధారణ వైద్యం కోసం ఆసుపత్రులకు వచ్చిన రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ సందర్భంగా ఈశ్వర్ శంకర్ మాట్లాడుతూ , ఉపకార వేతనాన్ని పెంచాలని, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు మించకుండా చూడాలని కోరారు. జాతీయ వైద్య మండలి నిబంధనల ప్రకారం ఎంఎస్సీ, పీహెచ్‌డీ నియామకాలు 15 శాతానికి లోపే ఉండాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయని, తమ సమస్యలపై ప్రభుత్వం పునరాలోచించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ వైద్యులకు ఆంధ్రప్రదేశ్ కంటే సుమారు 30 శాతం అధికంగా ఉపకార వేతనం అందుతున్నట్లు తెలిపారు.

సమ్మె కొనసాగుతున్నప్పటికీ అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సేవలు అందిస్తున్నామని ఈశ్వర్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వం త్వరగా సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రధానంగా ఉపకార వేతన సవరణపైనే డిమాండ్..**

జూనియర్ వైద్యులు ప్రధాన డిమాండ్ ఉపకార వేతనాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించడమే. 2009లో జారీ చేసిన జీవో 287 ప్రకారం వైద్య విద్యార్థులు, జూనియర్ వైద్యులకు చెల్లించే ఉపకార వేతనాన్ని ప్రతి రెండేళ్లకు ఒకసారి 15 శాతం చొప్పున పెంచాల్సి ఉందని సంఘం పేర్కొంటోంది. అయితే నిర్ణీత కాలానికి సవరణ జరగడం లేదని, ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఉపకార వేతనం సరిపోవడం లేదని వైద్యులు చెబుతున్నారు.

అదే సమయంలో, ప్రతి రెండేళ్లకు 15 శాతం పెంపు కాకుండా 30 శాతం చొప్పున పెంచాలని జూనియర్ వైద్యుల సంఘం డిమాండ్ చేస్తోంది. పని భారం, పెరిగిన జీవన వ్యయం, ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరగడం వంటి అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు.

**ప్రభుత్వం ప్రతిపాదన ఏమిటంటే...**

జూనియర్ వైద్యుల డిమాండ్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం వార్షిక ప్రాతిపదికన ఉపకార వేతనం పెంచే ప్రతిపాదనను చర్చల్లో ఉంచినట్లు సమాచారం. ఇందులో పీజీ వైద్యులకు సంవత్సరానికి 3 శాతం, ఇంటర్న్‌లకు 5 శాతం చొప్పున పెంపు ప్రతిపాదించినట్లు వెల్లడైంది. అయితే రెండేళ్లకు 15 శాతం, ప్రస్తుతం 30 శాతం పెంపు కోరుతున్న జూనియర్ వైద్యుల సంఘం ఈ ప్రతిపాదనపై సంతృప్తి చెందలేదు. దీంతో చర్చలు ఫలించలేదు.

**ప్రభుత్వం-వైద్యుల మధ్య కుదరని ఏకాభిప్రాయం...**

సమ్మె నేపథ్యంలో జూనియర్ వైద్యుల ప్రతినిధులు వైద్య విద్యాశాఖ ఉన్నతాధికారులతో వరుసగా చర్చలు జరిపారు. సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించినప్పటికీ రెండు రోజుల చర్చల్లోనూ స్పష్టమైన నిర్ణయం రాకపోవడంతో ఆందోళనను కొనసాగించాలని సంఘం నిర్ణయించింది.

**అత్యవసర వైద్య సేవలకు మాత్రం మినహాయింపు...**

సమ్మె కారణంగా సాధారణ వైద్య సేవలు, అత్యవసరం కాని సేవలకు అంతరాయం ఏర్పడుతున్నప్పటికీ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు చికిత్స అందించేందుకు జూనియర్ వైద్యులు అత్యవసర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర శస్త్రచికిత్సలను కూడా కొనసాగిస్తున్నారు. దీంతో సమ్మె ప్రభావం ప్రధానంగా సాధారణ వైద్య సేవలు, నిర్దేశిత చికిత్సలు, ఇతర అత్యవసరం కాని సేవలపై పడుతోంది..

**రోగులపై ప్రభావం..**

జీజీహెచ్‌కు ప్రతిరోజూ గుంటూరు జిల్లాతో పాటు పల్నాడు, బాపట్ల, ప్రకాశం తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తుంటారు. జూనియర్ వైద్యుల సమ్మెతో సాధారణ వైద్య సేవలు మందగించడంతో వైద్యుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కొంతమంది రోగులు చికిత్స వాయిదా వేసుకోవాల్సి వస్తుండగా, మరికొందరు ప్రత్యామ్నాయ వైద్య సేవలను ఆశ్రయించాల్సి వస్తోంది.

జూనియర్ వైద్యుల డిమాండ్లు–ప్రభుత్వ ప్రతిపాదనల మధ్య వ్యత్యాసం తొలగి, త్వరగా పరిష్కారం లభించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సంఘం హెచ్చరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తుండగా, రోగులకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలు కొనసాగించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

## యువజన దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



**ఆత్మకూరు(జర్నలిస్ట్ ఫైల్):** అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మలా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ లైబ్రరీ సెల్ ఆధ్వర్యంలో 'ఇగ్నైట్ ద సెల్ఫ్, ఇంపాక్ట్ ద వరల్డ్' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కళాశాల చీఫ్ లైబ్రేరియన్ ఎస్.కె. రేష్మా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

పోటీల్లో 46 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువత సమాజ అభివృద్ధిలో పోషించాల్సిన పాత్ర, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలపై విద్యార్థులు తమ ఆలోచనలను వ్యక్తపరిచారు. డా. పి. లక్ష్మయ్య, డా. ఎస్. పద్మావతి మూల్యాంకనకర్తలుగా వ్యవహరించారు.

కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన లైబ్రరీ కమిటీ సభ్యులను ప్రశంసించారు. లైబ్రరీ కమిటీ సభ్యులు, విద్యార్థి వాలంటీర్లు కార్యక్రమ నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య సమరంలో ప్రాణత్యాగం చేసిన వీరులు, దేశభక్తుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాన్ని ప్రపంచ స్థాయిలో ఉన్నత స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గుంటూరు పశ్చిమ ఏడో మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన అమరవీరుల చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నేటి బాలలే భావితరానికి పునాది రాళ్లని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ ఏడో మండల అధ్యక్షుడు గాలేటి బాబు ఆధ్వర్యంలో శ్రీనివాసరావుపేట 60 అడుగుల రోడ్డు నుంచి రామనామ క్షేత్రం ఎదురుగా ఉన్న భారతమాత విగ్రహం వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ నాయకుడు షేక్ నాగూర్ వలీ, జనసేన నాయకుడు ఆళ్ల శ్రీహరి, 22వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు చింతకాయల సాయి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి కే. నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు అప్పిశెట్టి రంగారావు, జిల్లా ఉపాధ్యక్షురాలు విమలాదేవి, మిర్చి యార్డు డైరెక్టర్ శ్రావణికుమారి, గోపి, సాంబశివరావు, రమ్య, రమాదేవి, కావేటి నాగేశ్వరరావు, రసూల్ బి., గండం బాబ్జి, కే. శివ, షేక్ సుభాని, సుజాత, ఆదిత్య, సిద్ధార్థ స్కూల్‌కు చెందిన శివ నాగేశ్వరరావు, శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట భద్రత



- పర్యటన నేపథ్యంలో ఏఎస్ఎల్ సమావేశం..
- భద్రత, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లపై సమీక్ష

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాయపూడిలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరుకానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్, పార్కింగ్ తదితర ఏర్పాట్లపై బుధవారం రాయపూడిలోని పెరేడ్ గ్రౌండ్‌లో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) సమావేశం నిర్వహించారు.

తుళ్లూరు మండలం రాయపూడి గ్రామ రెవెన్యూ పరిధిలోని మినిస్టర్స్ క్వార్టర్స్ వెనుక ఉన్న పెరేడ్ గ్రౌండ్‌లో ఉదయం 10 గంటలకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు నిర్వహించిన ఏఎస్ఎల్ సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై ఉన్నతాధికారులు సమగ్రంగా సమీక్షించారు.

సమావేశంలో గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ, ఐజీపీ రాజకుమారి, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఎస్ఎస్‌జీ ఎస్పీ సీహెచ్ భద్రయ్య, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ హారిఫ్ హఫీజ్‌తో పాటు అదనపు ఎస్పీలు రమణమూర్తి, రవికుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, సీఆర్‌డీఏ ఇంటెలిజెన్స్ డీఎస్పీ సుధాకర్, ఏఆర్ డీఎస్పీ సుంకరయ్య, డీపీవో గుంటూరు సాయికుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణ, ఎస్ఎఫ్ఓ వెంకటేశ్వర్‌రెడ్డి, తుళ్లూరు తహసీల్దార్ కే. శ్రీనివాసరావు, తుళ్లూరు సీఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్ అధికారులు, పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, వీఐపీలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. కార్యక్రమం సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, అవసరమైన చోట్ల డైవర్షన్లు, వాహనాల రాకపోకల నిర్వహణపై అధికారులు చర్చించారు. ముఖ్యమంత్రి, వీఐపీలు, ప్రజల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

పెరేడ్ గ్రౌండ్, వేదిక, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలను కూడా అధికారులు సమీక్షించారు. పోలీసు, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసేలా సమగ్ర భద్రతా ప్రణాళికను రూపొందించారు.

అనంతరం ఉన్నతాధికారులు పెరేడ్ గ్రౌండ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనతో పాటు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ధ్యేయం



- డిసెంబరు 1 నాటికి '95-95-99' లక్ష్యాల సాధన
- వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు
- 60 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచారాన్ని ప్రారంభించిన మంత్రి
- డిజిటల్ పర్యవేక్షణకు 'సురక్ష' డ్యాష్‌బోర్డ్ ఆవిష్కరణ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** హెచ్ఐవీ, ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, 2026 డిసెంబరు 1 నాటికి నిర్దేశిత '95-95-99' లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ సాధనలో యువతతో పాటు స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఏపీ శాక్స్) ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన '60 రోజుల ప్రత్యేక సమాచార, విద్య, ప్రచారం పేరుతో తయారు చేసిన కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ నియంత్రణలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. గతంతో పోలిస్తే కొత్త హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు 77 శాతం, మరణాలు 87 శాతం తగ్గడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ క్రమంలో అంచనా వేసిన హెచ్ఐవి బాధితుల్లో 95 శాతం మందికి హెచ్ ఐవి వచ్చినట్లు తెలిసి ఉండాలని, తెలిసిన వారిలో 95 శాతం మంది మందులు వాడుతూ ఉండాలని, మందులు వాడే వారిలో 99 శాతం మందికి వైరల్ లోడ్ బాగా తగ్గి ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ మూడు కేటగిరీల్లో రాష్ట్ర ప్రభుత్వం 88-87-96.2 శాతం మేర పురోగతిని సాధించిందని చెప్పారు. మిగిలిన లక్ష్యాన్ని(95-95-99) డిసెంబరు 1 గడువులోగా లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

**డిసెంబరు లక్ష్యంపై కేంద్రీకృత కార్యాచరణ:** ఈ మూడు దశల్లో ఎక్కడ లోటు ఉందో గుర్తించి.. అక్కడే ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ లక్ష్యాల సాధనలో యువతను ప్రధాన భాగస్వామ్యం చేయాలని, సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

**'సురక్ష'తో జిల్లాల వారీగా పర్యవేక్షణ:** హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల పురోగతిని, జిల్లాల వారీగా ఉన్న లోటుపాట్లను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు తయారు చేసిన లి'సురక్ష డ్యాష్‌బోర్డ్'లిను మంత్రి ఆవిష్కరించారు. దీని ద్వారా ఏ జిల్లాలో పురోగతి ఎలా ఉంది? ఎక్కడ లోటు ఉంది? ఎక్కడ ప్రత్యేక దృష్టి అవసరం? ఏ ప్రాంతాల్లో చర్యలను వేగవంతం చేయాలి? వంటి అంశాలను గుర్తించి తదనుగుణంగా కార్యాచరణ చేపట్టే అవకాశం ఉంటుంది.

**యువతతో 60 రోజుల ప్రత్యేక ప్రచారం:** రాబోయే 60 రోజుల పాటు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ తెలిపారు. ఎయిడ్స్ రహిత దేశం కోసం సన్నద్ధీకరణలో భాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం డిసెంబరు నాటికి 'సురక్షిత్ , సురక్షిత్ ప్లస్' లక్ష్యాలను సాధించే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. జానపద కళాజాతాలు, సామాజిక మాధ్యమాలు, కరపత్రాల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని తెలిపారు.

**తల్లి నుంచి బిడ్డకు సంక్రమణ నివారణ:** గర్భిణీలకు ముందస్తుగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వైద్య సేవలు, చికిత్స అందించడం ద్వారా తల్లి నుంచి బిడ్డకు హెచ్ఐవీ సంక్రమించకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ చక్రధర్ బాబు తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో చికిత్స అందేలా సేవలను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

**ఏఆర్‌టీ కేంద్రాల పనితీరుపై సమీక్ష:** జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఏఆర్‌టీ కేంద్రాల పనితీరును సమీక్షించడంతో పాటు.. చికిత్స పొందుతున్న వారి కొనసాగింపును పర్యవేక్షిస్తున్నామని ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. హెచ్ఐవీ నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా, చికిత్సలో ఉన్నవారికి నిరంతర సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాబోయే 60 రోజుల్లో చేపట్టే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలు, వల్నరబుల్ వర్గాల వరకు విస్తరించనున్నారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సిబ్బంది, విద్యాసంస్థలు, ప్రసార మాధ్యమాల భాగస్వామ్యంతో ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్తామన్నారు. గర్భిణీల పరీక్షలు, తల్లి నుంచి బిడ్డకు సంక్రమణ నివారణ, ఏఆర్‌టీ చికిత్స కొనసాగింపు, వైరల్ లోడ్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు. ప్రతి జిల్లాలోని గ్యాప్‌ను గుర్తించి.. దానికి తగిన చర్యలు తీసుకుంటాం. గుర్తింపు నుంచి చికిత్స వరకు, చికిత్స నుంచి వైరల్ లోడ్ నియంత్రణ వరకు ప్రతి దశను పర్యవేక్షిస్తాం. ఇప్పటికే సాధించిన పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లి ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణ దిశగా అడుగులు వేస్తాం" అని ప్రాజెక్ట్ డైరెక్టర్, స్మరణ్ రాజ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాక్స్ ఇన్ ఛార్జి అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, జేడీ ఐఈసి డాక్టర్ మంజుల, జేడీ టిఐ సుకుమార్, జేడీ బి. ఎస్. డి, సి.ఎస్.టి డాక్టర్. శ్రీనివాస వర్మ, జేడీ బి.టి.ఎస్ డాక్టర్ చక్రవర్తి ఈ ప్రచార కార్యక్రమంలో భాగస్వాములైన రాష్ట్రంలోని ముఖ్యమైన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు , యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంత్ రవిదాస్ కలశ యాత్రతో సామాజిక ఏకత్వానికి బీజేపీ పిలుపు

- కుల, మత భేదాలను వీడి సమానత్వం వైపు సాగాలి : బీజేపీ మాధవ్
- వారణాసి నుంచి వచ్చిన పవిత్ర కలశాలకు విజయవాడలో ఘన స్వాగతం



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** కుల, మత భేదాలను అధిగమించి సమాజంలో సోదరభావం, సమానత్వం, ఏకత్వాన్ని బలోపేతం చేయడమే సంత్ రవిదాస్ కలశ యాత్ర ప్రధాన ఉద్దేశమని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాల్లో భాగంగా వారణాసి నుంచి తీసుకొచ్చిన పవిత్ర కలశాలతో విజయవాడలో నిర్వహించిన కలశ యాత్ర అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సభలో ఆయన ముఖ్య ప్రసంగం చేశారు.

కాశీ విశ్వేశ్వర క్షేత్రం నుంచి తీసుకొచ్చిన పవిత్ర కలశాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఊరేగిస్తూ సంత్ రవిదాస్ మహరాజ్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని మాధవ్ తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గం ఒక్కటిగా నిలవాలన్నదే ఈ యాత్ర లక్ష్యమని చెప్పారు.

**వివక్షకు వ్యతిరేకంగా సంత్ రవిదాస్ బోధనలు:** 14వ శతాబ్దంలో సామాజిక వివక్ష, అంటరానితనం తీవ్రంగా ఉన్న సమయంలో సంత్ రవిదాస్ తన భక్తి, జ్ఞానం, ఆధ్యాత్మిక బోధనలతో సమాజ మార్పుకు కృషి చేశారని మాధవ్ పేర్కొన్నారు. భగవంతుడు ఏ కులానికో, మతానికో పరిమితం కాదని, ప్రతి మనిషిలోనూ దైవత్వాన్ని చూడాలని ఆయన బోధించారని తెలిపారు.

సంత్ రవిదాస్ రచనలు గురు గ్రంథ్ సాహిబ్‌లో స్థానం పొందడం ఆయన ఆధ్యాత్మిక ప్రభావానికి నిదర్శనమని అన్నారు. ఆయన బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని చెప్పారు.

**శ్రమకు గౌరవమే ఆయన సందేశం :** ఏ వృత్తీ తక్కువ కాదని, నిజాయితీగా చేసే ప్రతి పని భగవంతుని సేవేనని సంత్ రవిదాస్ తన జీవితంతో చాటిచెప్పారని మాధవ్ తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి వ్యక్తిని గౌరవించాలన్న సందేశం నేటి సమాజానికి అత్యంత అవసరమని అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలోని ఏకత్వ భావన, సామాజిక సమానత్వ సందేశం సమాజాన్ని ఏకం చేసే విలువలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. కుల భేదాలను అధిగమించి మనిషిని మనిషిగా గౌరవించడమే భారతీయ సంస్కృతి గొప్పతనమని చెప్పారు.

**రాష్ట్రవ్యాప్తంగా కలశ యాత్ర:** బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ మాట్లాడుతూ సంత్ రవిదాస్ జన్మస్థలమైన వారణాసిలో భారీ కార్యక్రమం నిర్వహించి అక్కడి నుంచి పవిత్ర కలశాలను తీసుకొచ్చామని తెలిపారు. విజయవాడలో వాటికి ఘన స్వాగతం లభించిందన్నారు. ఏలూరు రోడ్డులోని రామమందిరం నుంచి పాదయాత్రగా కలశాలను బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి తీసుకువచ్చి సభ నిర్వహించినట్లు చెప్పారు. సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలిగ్రామ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ పవిత్ర కలశాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలకు తీసుకెళ్లి సంత్ రవిదాస్ సందేశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు.

**కీర్తనలతో సామాజిక మార్పు:** ముఖ్య అతిథి శివస్వామి మాట్లాడుతూ 650 ఏళ్ల క్రితం జన్మించిన సంత్ రవిదాస్ మహరాజ్ భగవంతుని తత్వాన్ని కీర్తనల ద్వారా సమాజానికి అందించారని తెలిపారు. ఆయన కీర్తనలు సామాజిక మార్పులకు దోహదపడ్డాయని, నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

**ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ స్ఫూర్తి:** సంత్ రవిదాస్ 650వ జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా సామాజిక సమైక్యత, సోదరభావం, సమానత్వాన్ని బలోపేతం చేసే కార్యక్రమాలుగా నిలుస్తున్నాయని నాయకులు పేర్కొన్నారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' స్ఫూర్తితో కుల, మత భేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంత్ రవిదాస్ చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, సామాజిక న్యాయం, పరస్పర గౌరవంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, బిజెపి రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్, రాష్ట్ర ప్రొటోకాల్ ఇంఛార్జి పాతూరి నాగభూషణం, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీ రాం, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీ నివాస్ తదితరులు వేదిక ను అలంకరించారు.

# జీజీహెచ్‌లో మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లకు 'ఉన్నతి' ద్వారా కోటి రూపాయలు

- 100 సర్జరీలకు అవసరమైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం అందజేతకు సిద్ధం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో నిరుపేదలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు నిర్వహించేందుకు 'ఉన్నతి' ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటి రూపాయల విలువైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి ప్రకటించారు. ఈ మేరకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్‌తో ఆయన అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఈ సహకారంతో సుమారు 100 మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలకు అవసరమైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానున్నాయి. తాను స్వయంగా జీజీహెచ్‌కు వచ్చి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తానని డాక్టర్ నరేంద్రరెడ్డి తెలిపారు.

దశాబ్దం క్రితం జీజీహెచ్‌లో ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేయించుకున్న వారు, వారి కుటుంబ సభ్యులతో బుధవారం ఎంసీహెచ్ బ్లాక్‌లోని సమావేశ మందిరంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు చేయించుకున్న వారు వైద్యులతో కలిసి నృత్యాలు, కోలాటాలతో ఆనందోత్సాహాల్లో పాల్గొన్నారు.

డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ అప్పటి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అందించిన స్ఫూర్తితో జీజీహెచ్‌లో ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 125 మందికి ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. నిరుపేదలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతో గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ విజ్ఞప్తి మేరకు మరో కోటి రూపాయల విలువైన ఇంప్లాంట్లు, పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సేవ చేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని నరేంద్రరెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే జీజీహెచ్‌లో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని, వాటిని మరింత అభివృద్ధి చేయడంలో కళాశాల ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి మాట్లాడుతూ 125 మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు జరిగినప్పటికీ ఒక్కరికి కూడా ఇన్ఫెక్షన్ రాకపోవడం డాక్టర్ నరేంద్రరెడ్డి అంకితభావానికి నిదర్శనమన్నారు. ఆపరేషన్లు చేయించుకున్న వారు నృత్యాలు, కోలాటాలతో ఉత్సాహంగా పాల్గొనడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిరుపేదలకు ఉచితంగా మోకీళ్ల మార్పిడి ఆపరేషన్లు అందించేందుకు డాక్టర్ నరేంద్రరెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోనూ మోకీళ్ల మార్పిడి ఆపరేషన్ల విజయవంతమైన నిర్వహణకు ఆసుపత్రి తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

దశాబ్దం క్రితం ఆపరేషన్లు చేయించుకున్న పలువురు మాట్లాడుతూ తమకు నొప్పిలేని నడకను అందించిన డాక్టర్ నరేంద్రరెడ్డి, జీజీహెచ్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులతో కలిసి నృత్యాలు, కోలాటాల్లో పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పి. అనిల్‌బాబు, ప్రొఫెసర్లు డాక్టర్ ఎ. అజయ్, డాక్టర్ కె. శ్రీనివాసరావు, బీఎంఆర్ గ్రూప్స్ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, డాక్టర్ బూసిరెడ్డి ఉన్నతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ అభా ఐడీతో వైద్య సేవలు

- ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు అమలు తప్పనిసరి
- ఈహెచ్ఆర్ నమోదుతో రోగి ఆరోగ్య చరిత్ర భద్రం
- వినియోగంపై ఎన్ఎంసి డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షణ
- వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీర పాండియన్ వెల్లడి







**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల మేరకు ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ రోగులకు అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఐడీ ఆధారంగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ స్పష్టం చేశారు. ప్రభుత్వ బోధనాసుపత్రులతో పాటు ఇతర ప్రభుత్వాసుపత్రుల్లో ఇప్పటికే అభా ఐడీ ఆధారంగా సేవలు అందిస్తున్నామని, దీనివల్ల రోగుల ఆరోగ్య వివరాలతో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) రూపొందుతున్నాయని తెలిపారు. ఎన్ఎంసీ తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రైవేటు వైద్య కళాశాలల్లో అభా ఐడీల ఆధారంగా వైద్య సేవలు అందించే ప్రక్రియను వెంటనే అమలు చేయాలని వీరపాండియన్ కోరారు. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు.

**రోగి ఆరోగ్య వివరాలు నిక్షిప్తం**

రాష్ట్రంలో ఇప్పటివరకు 5.04 కోట్ల అభా ఖాతాలు సృష్టించగా, వాటికి అనుసంధానంగా 12.7 కోట్ల ఆరోగ్య రికార్డులు నమోదయ్యాయని తెలిపారు. రోగి ఎన్నిసార్లు ఆసుపత్రికి వెళ్లినా సంబంధిత ఆరోగ్య వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లో నమోదవుతాయని చెప్పారు. ప్రభుత్వాసుపత్రులతో పాటు కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఈ విధానం అమలవుతోందన్నారు. కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లో మాత్రం ఈ ప్రక్రియ ఇంకా కాగితాలకే పరిమితమైందని పేర్కొన్నారు. ఎన్ఎంసీ తాజా మార్గదర్శకాల నేపథ్యంలో అన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ ఈహెచ్ఆర్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావాలని స్పష్టం చేశారు. ఈహెచ్ఆర్ నమోదు చేయటంలో ప్రయివేటు కాలేజీల మధ్య పోటీతత్వం ఉండాలి అన్నారు.

**భవిష్యత్తు లో అత్యంత కీలకం**

దేశవ్యాప్తంగా రోగులకు విస్తృత ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో అభా ఖాతాల వ్యవస్థను రూపొందిస్తున్నారని వీరపాండియన్ తెలిపారు. భవిష్యత్‌లో వైద్య కళాశాలలకు సీట్ల మంజూరు, ఇతర అనుమతుల విషయంలో అభా ఖాతాల వినియోగాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లో అభా ఐడీ ఆధారంగా సేవలు, ఈహెచ్ఆర్ నమోదవుతున్న తీరును ఎన్ఎంసీ డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షిస్తోందని చెప్పారు.

**అభా రికార్డుకు రూ.10 ప్రోత్సాహకం**

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధరబాబు మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌తో అనుసంధానమైన హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్)ను ప్రైవేటు వైద్య కళాశాలలు వినియోగిస్తే రోగి ఆరోగ్య వివరాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీంతో రోగి అనారోగ్య చరిత్రపై వైద్యులకు త్వరగా అవగాహన రావడంతో చికిత్స సులభతరమవుతుందన్నారు.

ఒక్కో ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డును నమోదు చేసినందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 చొప్పున ప్రోత్సాహకం అందిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.150 కోట్ల మేర చెల్లింపులు జరగగా, రాష్ట్రానికి సుమారు రూ.15 కోట్లు అందాయని చెప్పారు. ఇందులో ప్రైవేటు ఆసుపత్రులకు జరిగిన చెల్లింపులు రూ.75 లక్షలు మాత్రమేనన్నారు.

**సాంకేతిక సహకారం అందిస్తాం**

ప్రైవేటు వైద్య కళాశాలలు అభా ఐడీల ద్వారా ఈహెచ్ఆర్ తయారీలో చురుగ్గా పాల్గొనాలని చక్రధరబాబు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని తెలిపారు. ఏ సాఫ్ట్‌వేర్ లేదా అప్లికేషన్‌ను వినియోగించినా, దానికి అనుగుణంగా సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

సదస్సులో ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సుధీర్, ఏబీడీఎం స్టేట్ నోడల్ అధికారి బీవీ రావు తదితరులు పాల్గొన్నారు. లిఈ కార్యశాల కోసం వైద్య ఆరోగ్య శాఖ పథకాల అమలులో సహకరిస్తున్న"ూూ౦ " సంస్థ సాంకేతిక మద్దతును అందించింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467